honeybee.org
Vol-11 Issue-2
వెల : రూ. 20/-

సంపుటి 11 సంచిక 2 జనవరి - ఫిబ్రవరి 2023

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక















పల్లెసృజన
www.pallesrujana.org

## పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన గ్రామీణ ఆవిష్కరణలు

NABARD

# జొన్న వేరుశనగ అంతర సేద్యాల వీడర్



ఇన్నోవేటర్
**వెంకటేశ్వరా చారి**
హన్మకొండ జిల్లా, తెలంగాణ

### జొన్న నుండి ప్రత్తి వరకు పనికి వచ్చే ఏకచక్ర వీడర్

జొన్న నుండి ప్రత్తి వరకు అన్ని పంటల్లో ఎద్దులతోనే అంతర సేద్యాలు చేయాలి. ఒక ఎద్దుల జతకు 5-6 దంతెలు వేసి ఒక్కో దంతెను ఒక కూలీ పట్టుకొని అంతర సేద్యాలు చెయ్యాలి. ఇది అత్యంత ఖర్చుతో కూడుకున్న పని. ఒక ఎద్దుల జత, ఎద్దులు తోలే మనిషి, 6 దంతెలను పట్టుకునే కూలీలు. ఈ వీడర్‌తో ఒకే మనిషి 3-4 సాళ్ళలో సునాయాసంగా అంతర సేద్యం చేయవచ్చు. ఈ వీడర్‌కు వున్న చక్రం మధ్య సాలులో వుంటుంది. అవసరం అనుకుంటే బ్యాలెన్స్ కొరకు వెనక రెండు వైపులా సైకిల్ చక్రాలను తగిలించుకోవచ్చు. ఉన్న ఒక్క చక్రం పైన అయినా సరే బ్యాలెన్స్‌గా ఉంటుంది. 12 అంగుళాల నుండి 30 అంగుళాల వెడల్పు వరకు మహిళలు కూడా సులభంగా అంతర సేద్యం చేసుకోవచ్చు.






వివరాలకు సంప్రదించండి
పల్లెసృజన
77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096
E-mail : anchor@pallesrujana.org Visit us : www.pallesrujana.org

హనీబీ

NATIONAL INNOVATION FOUNDATION
E-mail : info@nifindia.org www.nifindia.org
Toll Free : 1800 233 5555

పల్లెసృజన
www.pallesrujana.org

పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన గ్రామీణ ఆవిష్కరణలు

NABARD

# వేరుశనగ విత్తనాల పొట్టు తీసే యంత్రం



ఇన్నోవేటర్
**జ్యోతుల జస్వంత్**
గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

### చిక్కీలు చేయటం ఇక సులువు

వేరుశనగ పప్పుతో చిక్కీలు, బెల్లపు ఉండలు తయారు చేయాలంటే ముందుగే వేరుశనగ విత్తనాలను వేడి చేసిన తర్వాత వాటిపైన వున్న పొట్టును తీయాలంటే వ్యాపార పరంగా చేసే వారికి ఎంతో శ్రమతో కూడుకున్న పని. చిక్కీలు తయారు చేసే యాజమాన్యం ఇందు కొరకు చాలా మందిని వినియోగిస్తుంది. ఈ సమస్య పరిష్కారానికి వేరుశనగ విత్తనాలను రెండు ముక్కలుగా చేసి, వాటిపైన వున్న పొట్టు వేరు చేసే యంత్రం తయారైంది. విత్తనాలు వేయించిన తర్వాత ఈ యంత్రంలో వేస్తే చాలు ముక్కలై శుభ్రంగా వున్న వేరుశనగ పప్పు ఒకవైపు, పొట్టు మరో వైపు వస్తాయి. ఐదారు మంది మనుషులు చేసే పని కేవలం ఒక్క మనిషి చేయవచ్చు.



వివరాలకు సంప్రదించండి
పల్లెసృజన
77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096
E-mail : anchor@pallesrujana.org Visit us : www.pallesrujana.org

హనీబీ

NATIONAL INNOVATION FOUNDATION
E-mail : info@nifindia.org www.nifindia.org
Toll Free : 1800 233 5555

సంపుటి-11 సంచిక - 2 జనవరి - ఫిబ్రవరి 2023

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-40253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్ములమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్ములమడక శ్రీకర్**
**కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్,** హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 400/-**
**for 2 years Subscription**

## ఈ సంచికలో.....

* చెఱకు పంటకు విలువ జోడించి అధిక లాభాలార్జిస్తున్న సృజనాత్మక రైతు 'మేడపాటి వీరారెడ్డి' - 4
* ఖర్చు లేకుండా కరెంటు తియ్యగలమని నిరూపిస్తున్న ఇన్నోవేటర్ 'అడిగోపుల రాముడు' - 8
* సీరియల్ ఇన్నోవేటర్ 'అల్లాడి ప్రభాకర్'కు "రైతునేస్తం పురస్కారం" - 10
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 11
* పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి - 13
* జి-20 దేశాల సదస్సులో భాగంగా కొల్హాపూర్ కనేరిలోని సిద్ధగిరి మఠం ఆధ్వర్యంలో జరిగిన 'సివిల్-20' ప్రదర్శన - 18
* ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం - 21
* 'ఈకో బాబా' అని పిలువబడే "బల్బీర్‌సింగ్ సీచేవాల్' పద్మశ్రీ గ్రహీత కథ - 24
* రోడ్డు సౌకర్యం లేని మారుమూల గ్రామాలకు ఓ వరం - శ్రమను తగ్గించే 'డోలీ అంబులెన్స్' - 26
* చెట్లను ఎక్కే బైకు తయారు చేసిన 'కర్ణాటక రైతు గణపతి భట్' - 27
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 29
* స్పందన - 31

**కవర్ లోపలి పేజీలో ...**
అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

**మధ్య పేజీలో :**
జనవరి-ఫిబ్రవరి 2023 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. -500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

## సంపాదకీయం

# 'పల్లెసృజన'కు ఊపునిస్తున్న ప్రభుత్వ పథకాలు - సందిగ్ధాలు

2022వ సంవత్సరం భారత ప్రభుత్వం 'స్టార్ట్ అప్' లకు అత్యధిక ప్రాధాన్యతను, ప్రోత్సాహాన్ని ఇచ్చింది. ప్రైవేటు పెట్టుబడిదారులు కూడా ముందుకు వచ్చి వేలల్లో స్టార్ట్ అప్స్‌కు నివేశం చేశారు. దీంతో సమాజంలో ముఖ్యంగా యువతలో ఒక ఆవేశం లాగా స్టార్ట్ అప్‌ల వైపు అధికంగా మొగ్గు చూపు తున్నారు. పల్లెసృజన అనుభవంలో అత్యుత్సాహం. యువతను తప్పుదోవ పట్టించే అవకాశాలుంటాయి. ఇది మన చిరంజీవుల భవిష్యత్తులతో ముడిపడింది కాబట్టి వారిని సరైన దిశలో మార్గదర్శకత్వం చేయడం సమాజ పెద్దల కర్తవ్యం.

ఈ 'స్టార్ట్ అప్' ఉద్యమంలో మన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లకు అవకాశాలున్నాయా? దీని గురించి కొంత మనం చర్చించుకుందాం. కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు సమాజంలోని ఇన్నోవేటర్లకు ప్రోత్సాహంగా వేరువేరు శాఖల నుండి ధన సహాయం చేస్తున్నది. ప్రధానంగా డిఎస్‌టి, డిబిటి, బిక్యాప్, ఎంఎస్‌ఎంఇ లాంటి ప్రభుత్వ శాఖలు రఫ్తార్, నిధి ప్రయాస్ (మూడు దశలు) ఇంకా ఎన్నో పథకాలు అమలులోకి తెచ్చింది. ఇవన్నీ కాలేజీల్లో చదువుకున్న యువతకు అందుబాటులో ఉంటాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కొన్ని గ్రాంటులు ప్రకటించచాయి. టిఎస్‌ఐసి గత సంవత్సరం 20 మంది ఇన్నోవేటర్లకు గ్రాంటు రూపంలో కొంత ధన సహాయం చేసింది. ఇందులో గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లు కూడా ఉన్నారు. అలాగే ఒక గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్‌కు 'నిధి ప్రయాస్' గ్రాంటు కూడా లభించింది. అయితే ఈ కేంద్ర ప్రభుత్వ పథకాలకు కొన్ని షరతులున్నాయి. స్టార్ట్ అప్‌లు ఎల్‌ఎల్‌పి లేదా కంపెనీ లిమిటెడ్‌గా రిజిష్టర్ చేసుకోవాలి. ఈ ప్రాథమిక అవసరం మన గ్రాస్ ఇన్నోవేటర్లకు ఇబ్బందిగా ఉంటుంది. వ్యవస్థలో నేరుగా అన్ని రూల్స్ పాటిస్తూ (చాలా వరకు వారికి తెలియవు) కంపెనీ నడపటానికి వారికి సామర్థ్యం లేదు. ఎలాంటి శిక్షణలు పెద్ద యెత్తున సామాన్య ప్రజానీకానికి జరగడం లేదు. దీంతో ఎక్కువ మంది గ్రామీణ ఇన్నోవేటర్లు కేంద్ర పథకాలను వాడుకోలేక పోతున్నారు. ఒకవేళ స్థానిక సంస్థలు/ కళాశాలలు సహాయానికి ముందుకు వచ్చినా, ఆంగ్లంలో ఉండటం, ఫీజులు అడగటం, నిధుల్లో కోతలు, వీరిని అగౌరవంగా చూడటం, పెత్తనం చలాయించటం, అన్నీ మాకు తెలుసన్న అహంకారంతో నిమ్నంగా ప్రవర్తించటం, అన్నీ ఈ సంస్థల ప్రతినిధుల చేతిలో పెట్టి, వారి జవాబుకై పడిగాపులు పడటం.... ఇలా అన్ని రకాల అవస్థలు అందరూ పడుతున్నారు. నిధులు కావాలి, గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లకు తమ పరిష్కారాలను రైతులకు, ప్రజలకు అందించాలి. ప్రభుత్వ పద్ధతి కఠినతరంగా, అవకాశం లేకుండా తయారు చేయబడింది. వ్యవస్థలో భాగం కాని గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లకు ఈ పథకాలు ఏవిధంగానూ అనుగుణంగా లేవు.



2022లో కేంద్ర ప్రభుత్వం ఇన్నోవేషన్ ఉద్యమాన్ని అతి త్వరితం చేయడానికి స్టార్ట్ అప్ సంస్థలను అంకుర సంస్థ (ఇంకుబేటర్)తో సంధానం చేయుటం తప్పనిసరిగా చేసింది. దీంతో ప్రభుత్వం, ప్రైవేటు కళాశాలలు, విశ్వ విద్యాలయాలు వందల కొద్ది 'అంకుర సంస్థ'లను ప్రారంభించాయి. స్థానిక యువతకు, గ్రామీణ ఇన్నోవేటర్లను ఆకర్షించడానికి, దాని ద్వారా ఇన్నోవేషన్లను సంస్థాగతం చేయడానికి, నిధులు ఇవ్వడానికి మార్గదర్శకత్వం చూపడానికి పలు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరిలో ఎన్‌ఐటిలు, ఐఐటిలు కూడా ఉన్నాయి. ఈ కళాశాలలు ప్రతిభను మనం ఒప్పుకుంటాం కాని, గ్రామీణ ఇన్నోవేటర్లు, వారి ఇన్నోవేషన్లను గురించి, గ్రామ ప్రజల సమస్యల గురించి ఆర్థిక, సామాజిక, విద్యాపరంగా గ్రామస్తుల స్థితిని అవగాహన చేసుకోవడం ఈ కాలేజీ అంకుర సంస్థల వల్ల సాధ్యం కాదు. ఉదాహరణకు హైదరాబాద్‌లో 40 కి మించి అంకుర సంస్థలు ఉండగా, ఇంత వరకు ఒక గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను పెంచి మార్కెట్‌లోకి తీసుకు రాలేదు. 2-3 మాత్రం 2022వ సంవత్సరంలో పోషించడం ప్రారంభమైంది. అంటే కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను పెంపొందించడానికి నిజంగా, ప్రత్యేకంగా ఏమీ చేయలేదు. వీరిని కూడా చదువుకున్న ఆంగ్లం తెలిసిన వ్యవస్థలో అవగాహన ఉన్న యువతతో జత చేయడం గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లను, వారి ఇన్నోవేషన్లను ఈ నిధుల పథకాల నుండి బహిష్కరించడమే కదా!

# సంపాదకీయం

పల్లెసృజన నాలుగు సంవత్సరాల క్రితం తెలంగాణలో గ్రామ ప్రాంతాలలోని ఎస్ఆర్ యూనివర్శిటీ ఇన్‌క్యుబేటర్‌తో చర్చలు జరిపింది. వారు సగర్వంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రథమ ఇన్‌క్యుబేటర్‌గా అని గర్వంగా చెప్పుకునేవారు. రోజంతా జరిగిన చర్చల్లో తేలిందేమిటంటే మన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను పోషించడానికి వారు తయారుగా లేమని నిష్కర్షగా చెప్పారు. మరి గ్రామీణ ఇన్నోవేషన్లకై గ్రామ ప్రాంతాల్లో అంకుర సంస్థ  పెట్టామని ఎందుకు సమాజానికి చెప్పాలి?

కొందరు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లు అంకుర సంస్థల్లో చేరి అక్కడి వాతావరణం, అవమానం, అనుమానం, పెత్తనాలు భరించలేక ఖర్చు పెట్టిన ధనం తిరిగి ఇచ్చి పథకాల నుండి విరమించుకున్నారు.

ఇదే సమాజంలో ఇదే పరిస్థితుల్లో పల్లెసృజన వాలంటీరు బృందం గత 17 సంవత్సరాలలో వందకంటే ఎక్కువ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను సమాజానికి చేరవేయడంలో పూర్తి విజయవంతమైంది. అయితే కేంద్ర పథకాలు, పల్లెసృజన ప్లానుల్లో తేడా ఏమిటి? ఈ అంతరాన్ని ఎలా తగ్గిద్దాం. చివరకు మన సమాజానికి కావలసింది ఇన్నోవేషన్లు ఎక్కడ ఉన్నా అవి ప్రజలకు అతి త్వరలో చేరాలి. గ్రామ ప్రజల కష్టాలు, నష్టాలు తగ్గాలి. ఇది లక్ష్యంగా పెట్టుకుంటే వికేంద్రీకరణ పద్ధతిలో, గ్రామాలకు వెళ్ళి వారితో చర్చించి, ప్రతి ఇన్నోవేషన్‌ను ప్రత్యేకంగా పరిశీలించి, అతి త్వరగా ఇన్‌క్యుబేషన్ ప్రాసెస్ ను డిజైన్ చేసి, అద్భుత,గా సమాజానికి లాభమయ్యేలాగా అమలు పరచాలి. పల్లెసృజన తమ అనుభవాలను అందరితో ప,చుకోవడానికి సిద్ధంగా ఉంది.

**ముఖ్యమైన సలహాలు ఈ సందర్భంగా పల్లెసృజన విన్నవించుకుంటుంది:**

- జాతీయ స్థాయిలో గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు ఒక ప్రత్యేక గ్రూపుగా పరిగణించాలి.
- జాతీయ పరిశోధనా సంస్థలో గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను ప్రత్యేకంగా గుర్తించాలి. దానికి కావలసిన బడ్జెట్, వనరులు, సంస్థాగతం చేయాలి.
- వికేంద్రీకరణ అతి ముఖ్యం.
- ఆర్థిక సామాజిక అసమానతలతో, వేరువేరు భాషలతో సతమతమవుతున్న అమాయక గ్రామ ఇన్నోవేటర్లను వ్యవస్థాగతంగా గౌరవించాలి. వీరి వద్దకు వ్యవస్థ చేరాలి.
- సంవేదనా శీలురైన ఇన్నోవేటర్లతో వ్యవస్థ కూడా వారిపట్ల అదే పద్ధతిలో ప్రవర్తించాలి. అభివృద్ధి చేయాలి.
- స్థానిక భాషల్లో స్థానిక సంస్థలను విరివిగా ఉపయోగించాలి. గ్రామ పంచాయతీ వ్యవస్థ, గ్రామీణ ప్రజా సమూహాలు ఈ ఇన్నోవేషన్లను  స్వంతం చేసుకుని, గర్వంగా  వీటిని వ్యవస్థ సహాయంతో సమాజానికి చేర్చాలి.
- ప్రామాణికత చాలా సులువుగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఈ ప్రామాణికత స్థానికంగానే జరగాలి.
- ఇన్నోవేషన్లను ఒక కేంద్రీయ డిజిటల్ ప్లాట్‌ఫారం ద్వారా గ్రంథస్థం చేయాలి. అన్ని దేశ భాషల్లో ఈ ఇన్నోవేషన్లు అందరికీ మొబైల్ ద్వారా అందుబాటులో ఉండాలి.
- ఐఐటీలు, ఎన్ఐటీలు లాంటి ఉత్తమ సంస్థలు ఉన్నత భారత అభియాన్ (యుబిఎ) ద్వారా విజ్ఞులైన అధ్యాపకులు, విద్యార్థులు, రీసర్చ్ స్కాలర్లు, గ్రామాలను విరివిగా సందర్శిస్తూ సమస్యలను, పరిష్కారాలను గుర్తించాలి. యుబిఎ వ్యవస్థను ప్రభావ వంతంగా నడిపించాలి.

పైన సూచించిన అంశాలపై పాఠకులు పల్లెసృజనతో చర్చించాలని మా ఆహ్వానిస్తున్నాం. వీలైనంత త్వరగా ఈ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను మనం సమాజానికి అందించడానికి పూర్తి ప్రయత్నాలు చేయాలి.  మీరంతా ఈ సమస్యను అర్థం చేసుకుని అంకుర వ్యవస్థలోనే సరియైన మార్పులు తేగలిగితే సమాజంలో ఆనందం పెరుగుతుందని పల్లెసృజన విశ్వాసం.

పల్లెసృజనకు "గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - జీవనశైలి"పై సి-20 లైఫ్ ద్వారా జి-20 కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఆహ్వానం లభించింది. మన అనుభవాలను అంతర్జాతీయ వేదికపై అర్థవంతంగా సమర్పించాలని పల్లెసృజన కృషి చేస్తోంది.

'పంచభూత లోకోత్సవ్' కొల్హాపూర్ సమీపంలో గల 'కనేరి ఆశ్రమం'లో ఫిబ్రవరి ఆఖరి వారంలో అత్యంత ఘనంగా జరిగింది. పల్లెసృజన ఇన్నోవేటర్లకు ఆహ్వానం రావడంతో తెలుగు ఇన్నోవేటర్లు ఉత్సాహంగా  ఈ అద్భుత కార్యక్రమంలో ఎంతో ఆనందంగా పాల్గొనడం జరిగింది. దీని గురించి ప్రత్యేక కథనం ఈ సంచికలో ముద్రించాము.

ఎండాకాలం ప్రారంభమౌతోంది, అందరూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని మనసారా కోరుకుంటూ .....

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

# చెఱకు పంటకు విలువ జోడించి అధిక లాభాలార్జిస్తున్న సృజనాత్మక రైతు మేడపాటి వీరారెడ్డి



- వీరరాఘువ రెడ్డి

'రైతుకు కావలసింది తాయిలాలు కాదు – శ్రమకి తగ్గ ఫలితం కావాలి' అంటుంటారు చాలా మంది. పంటను పండించటంతోనే తమ బాధ్యత అయిపోయింది అనుకుంటారు కొందరు. 'పంటను ముడి సరుకుగా కాకుండా ఇంకొంచెం శ్రమించి, విలువను జోడించి విక్రయిస్తే సిరులు కురుస్తాయి' అంటూ మొదట్నుంచి చెబుతోంది "పల్లెసృజన". ఈ సూక్ష్మాన్ని అర్థం చేసుకున్న కొంతమంది రైతులు తమ పంట ఉత్పత్తులను యధాతథంగా మార్కెట్లో అమ్ముకోకుండా, వాటికి విలువను జోడించి విక్రయించి తమ పంటతోనే సిరులు కురిసేలా చేసుకుంటున్నారు కొందరు సృజనాత్మక రైతులు. ఆ కోవకి చెందిన వాడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతం కోనసీమ జిల్లా), రావులపాలెం మండలం, గోపాల పురం గ్రామానికి చెందిన రైతు "మేడపాటి వీరారెడ్డి". ఈయన కీ.శే. మేడపాటి సత్యనారాయణ రెడ్డి, క్రిష్ణవేణిల నలుగురు కుమారుల్లో పెద్ద వాడు. వీరిది ఒక మధ్యతరగతి రైతు కుటుంబం. మిగిలిన ముగ్గురు తమ్ముళ్లు కూడా ఇతర వ్యాపారాల్లో స్థిరపడ్డారు. వీరారెడ్డి భార్య 'గౌరీ కుమారి' ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు, ఇతనికి ఇద్దరు కుమారులు. పెద్దవాడు హైదరాబాద్ లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు, ఇటీవలే వివాహం అయింది. చిన్నవాడు ఇంటర్ రెండవ సంవత్సరం చదువు తున్నాడు. వీరారెడ్డి చదివింది ఇంటర్ వరకు మాత్రమే. ఆ తరువాత బ్రతుకుదెరువు కోసం ఎన్నో వ్యాపకాలు చేశాడు. కిరాణా షాపు కొద్ది రోజులు నడిపాడు, కొద్ది రోజులు పొక్లెయినర్ నడిపాడు, కోళ్ళకు వ్యాక్సిన్ చేసే వ్యాపారం.... ఇలా ఎన్నో రకాల వ్యాపారాలు చేశాడు. అయినా ఎందులోనూ తనకు తృప్తి అనిపించలేదు.

ఇక తన కుటుంబ వ్యాపకం అయిన వ్యవసాయంలోనే జీవనం కొనసాగిద్దామనుకుని, అప్పుడప్పుడే ప్రాచుర్యం పొందుతున్న సేంద్రియ వ్యవసాయం చేస్తే బావుంటుందని తలచి, తనకున్న కొద్దిపాటి పొలంతో పాటు, హైవే ప్రక్కనే వున్న 5 ఎకరాల పొలం కౌలుకు తీసుకున్నాడు. మొదట కూర గాయల పంటలు వేశాడు. ఈ పంటకు ప్రధానంగా వ్యవసాయ కూలీలపైనే ఎక్కువగా ఆధార పడాల్సిన కారణంగా, సమయానికి కూలీలు లభించక కొంత వరకు నష్టపోవాల్సి వచ్చింది. ఎందుకు అనిపించిందో తనకున్న పొలంలో ఒక ఎకరం చెఱకు నాటాడు. పంట వచ్చిన తర్వాత ఈ కొద్దిపాటి చెఱుకు చక్కెర కర్మాగారానికి అమ్మటం కంటే దీనికి విలువను జోడించి అమ్మితే ఇంకా లాభసాటిగా ఉంటుంది కదా అని ఆలోచించాడు. తన పొలం ఎటూ ప్రధాన రహదారి (హైవే) ప్రక్కనే ఉంది కదా అని 'చెఱుకు రసం' వ్యాపారాన్ని ప్రారంభించాడు. అందులో కూడా కొన్ని ప్రత్యేకతలు ఉండాలన్న తలంపుతో పొలంలో కోసిన చెఱుకును నేరుగా రసం చేయటానికి ఉపయోగించకుండా, దానిపైన ఉన్న బ్యాక్టీరియా లాంటి కల్మషాలను తొలగించి, ఆరోగ్య కరమైన రసం అందించాలన్న ఉద్దేశ్యంతో కోసిన చెఱుకును ఉప్పునీటితో శుభ్రంగా కడిగి, ఆ తర్వాత రసం తీసి అమ్మేవాడు. ఈ విధంగా ఎవ్వరూ చేసేవారు కాదని, అందువల్లనే తన చెఱుకు రసానికి ఇతరులు చేసే రసానికీ రుచిలో చాలా తేడా ఉన్నట్లు వినియోగ దారుల ద్వారా తెలుసుకున్నాడు. అలా తన చెఱుకు రసం మంచి ప్రజాదరణ పొందింది.

పొలంలో కోసిన చెఱుకును నేరుగా రసం చేయటానికి ఉపయోగించకుండా, దానిపైన ఉన్న బ్యాక్టీరియా లాంటి కల్మషాలను తొలగించి, ఆరోగ్య కరమైన రసం అందించాలన్న ఉద్దేశ్యంతో కోసిన చెఱుకును ఉప్పునీటితో శుభ్రంగా కడిగి, ఆ తర్వాత రసం తీసి అమ్మేవాడు. ఈ విధంగా ఎవ్వరూ చేసేవారు కాదని, అందువల్లనే తన చెఱుకు రసానికి ఇతరులు చేసే రసానికీ రుచిలో చాలా తేడా ఉన్నట్లు వినియోగ దారుల ద్వారా తెలుసుకున్నాడు.

ఇక ఈ వ్యాపారం బావుంది అనుకున్నాడు. చెఱుకును కర్మాగారానికి అమ్మితే వాళ్ళు ఇచ్చేది టన్నుకు 3 నుండి 4 వేల రూపాయలు మాత్రమే. కానీ, ఇలా కొంచెం శ్రమపడి చెఱుకు రసం తయారు చేసి అమ్మటం ద్వారా ఇతనికి టన్నుకు



దాదాపు 25 నుండి 30 వేల రూపాయలు వస్తోంది. ఇక ఆలస్యం చేయకుండా తనకున్న వెసులు బాటును బట్టి తన గ్రామానికి ఎదురుగా వున్న రహదారిపైన ఏర్పాటు చేసుకున్న ప్రధాన కార్యాలయంతో పాటు అదే రహదారిపై అటువైపు రాజమండ్రి (35 కి.మీ.) వరకు, ఇటువైపు విజయవాడ (160 కి.మీ.) వైపు రహదారిపైన వున్న ఓ మోస్తరు పట్టణాల సమీపంలో ఇప్పటికి 22 బ్రాంచీలను ఏర్పాటు చేసుకున్నాడు. “సేంద్రియ రైతు దుకాణం – సేంద్రియ చెఱకు రసం” పేరుతో అన్ని బ్రచీలు ఒకేలా ఉండేలా శ్రద్ధ తీసుకున్నాడు.

ప్రస్తుతం వీరారెడ్డి చెఱకు రసం బ్రాంచీలు ‘రావుల పాలెం, మండపేట, తణుకు, తాడేపల్లి గూడెం, అమలాపురం, భీమవరం, పెనుగొండ .... ఇలా మొత్తం 22 బ్రాంచీలు ఏర్పాటయ్యాయి. ఒక్కో బ్రాంచీలో చెఱుకును రసం తయారు చేసే అధునాతన యంత్రం ఒకటీ,





విలువను జోడించి ఆరోగ్యకర ఉత్పత్తులను సమాజానికి అందిస్తున్న

## స్ఫూర్తి పొందిన రైతు యం.యస్.యన్. రాజు



విశాఖపట్నం (ప్రస్తుతం అనకాపల్లి) జిల్లా, పాయకరావు పేట మండలం, శ్రీరాంపురం గ్రామానికి చెందిన ‘మందపాటి సత్య నారాయణ రాజు’ అనే ఆదర్శ రైతు రావుల పాలెంకు చెందిన రైతు వీరారెడ్డి తన వంటకు విలువను జోడించి, అధిక ఆదాయం పొందుతున్న విధానానికి స్ఫూర్తి పొంది తాను కూడా ఇలా చేస్తే బావుంటుంది అనుకున్నాడు. సేంద్రియ వ్యవసాయం చేయటం ద్వారా తన కుటుంబం మాత్రమే ఆరోగ్యకరమైన ఆహారం పొందటం కాదు, ఇది సమాజానికి చేర్చాలన్న సంకల్పమే వీరిని ఈ విధంగా స్ఫూర్తి పొందేలా చేసింది. రాజు గారు గత 11 సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. తనకున్న 20 ఎకరాలతో పాటు మరో 40 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా వరి, చెఱకు, అరటి, బొప్పాయి పండిస్తున్నారు. వారి పొలంలో కొబ్బరి, అందులో కోకో పంటలు కూడా ఉన్నాయి.

ప్రత్యేకించి చెఱకు పంట సంవత్సరం పొడవునా దిగుబడి వచ్చేలా నాటుకుని తన పొలంలోనే ఒకచోట ఎప్పుడూ బెల్లం తయారీ అయ్యేలా చర్యలు చేపట్టారు. వాటితో పాటు వరి, పండ్లను నేరుగా మార్కెట్‌కు తరలించకుండా, తన స్వగ్రామానికి 6 కి.మీ. దూరంలో వున్న ‘తుని’లో ఒక దుకాణం, సమీపంలోని విశాఖ పట్నంలో మరో దుకాణం ఏర్పాటు చేసి, ‘సేంద్రియ వ్యవసాయ రైతు ఉత్పత్తులు’ పేరుతో వినియోగ దారులకు నేరుగా అందే ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు, నాలుగు చోట్ల కూడా చెఱకు రసం దుకాణాలు ఏర్పాటు కూడా చేసి విక్రయించుకుంటూ అధిక ఆదాయాన్ని పొందుతున్నారు. ఈవిధంగా చేయటం వల్ల వినియోగ దారులకు ఆరోగ్యకరమైన ఆహారం ప్రధానంగా బెల్లం అందించటం వల్ల ఎంతో కొంత మంది ఆరోగ్యాలను కాపాడటంతో పాటు, తాము కూడా నేరుగా మార్కెట్‌కు విక్రయించి, నష్టపోకుండా అధిక ఆదాయాన్ని పొందుతున్నామన్నారు సత్యనారాయణ రాజు.

తమ పంటలను అన్నిటినీ, పూర్తిగా పాలేకర్, సివిఆర్ పద్ధతిలోనే పండిస్తున్నామన్నారు. బెల్లం తయారీలో 15 మందికి పైగా, చెఱకు రసం దుకాణాల్లో 8 మంది, హోల్‌సేల్ దుకాణాల్లో మరో 5 మందికి ఉపాధి కూడా లభించటం ఎంతో ఆనంద దాయకం అన్నారు. ఈవిధంగా చేయటం వల్ల ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించ గలుగుతున్నామన్న తృప్తి మమ్మల్ని ఇంకా ముందుకు సాగేలా ప్రోత్సహిస్తోందని అన్నారు సత్యనారాయణ రాజు గారు. రైతులందరూ ఇలా తమ పరిధిలో వీలైనంత వరకు ఉత్పత్తులకు విలువలు జోడించి తమ ఉత్పత్తులను విక్రయించుకొని అధిక, తృప్తికర ఆదాయంతో ముందుకు వెళ్ళాలని కోరుకుంటోంది ‘పల్లెసృజన’.

**రైతు సత్యనారాయణ రాజు గారి ఫోన్ : 81251 77871.**











130– నుండి 150 కిలోల వరకు చెఱకు నిల్వ చేసుకునేలా ఒక ఫ్రిజ్ ఏర్పాటు చేశాడు. తనకు అవసరమైన చోట దుకాణం ఏర్పాటు చేసుకోవటానికి ఆ పొలం రైతు గట్ల వద్ద స్థలాన్ని లీజులు తీసుకోవటం షాపు ఏర్పాటు చెయ్యటం లాంటి వాటికి ఒక్కో బ్రాంచికి షుమారు 4 లక్షల వరకు ఖర్చు చేశాడు. ఇలా ఈ 22 బ్రాంచీలను ఏర్పాటు చెయ్యటానికి దాదాపు 6 సంవత్సరాలు పట్టింది.

తన వ్యవసాయానికి అవసరమైన పేడ కొరకు 4 ఆవులు ఏర్పాటు చేసుకున్నాడు. వాటికి పుట్టిన పిల్లలు పెరుగుతూ ఉంటాయి కాబట్టి తనకు కావలసినన్ని ఆవులను తను ఉంచుకుని, మిగతా వాటిని సేంద్రియ వ్యవసాయం చెయ్యాలనుకున్న వారికి ఆవు దూడలను పాలు మరిచిన తర్వాత ఇస్తూ ఉంటాడు.

వీరారెడ్డి ఏర్పాటు చేసిన షాపుల్లో ఒక్కోదాంట్లో ఇద్దరు చొప్పున 40 మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశం కల్పించాడు, పొలంలో ఈ షాపులకు కావలసిన చెఱకును కోసి, శుభ్రం చేసి, వాటిని ముక్కలుగా చెయ్యటానికి దాదాపు 10–15 మంది వ్యవసాయ కూలీలు, ఈ వ్యవసాయ కూలీలు సీజన్ (ఎండాకాలం)లో 50–60 మంది దాకా ఉంటారు. తయారు చేసిన చెఱకును దుకాణాలకు అందించటానికి రెండు వాహనాలు, వాటిని నడిపేందుకు ఒక్కోదానికి ఇద్దరు చొప్పున నలుగురికి ఉద్యోగం ఇలా తాను కేవలం రైతుగానే 60 మందికి పైగా ఉద్యోగాలు కల్పిస్తున్నాడు. ఈ వాహనాలు ప్రతిరోజూ చెఱకును దుకాణాల్లో దించి, అక్కడ రసం తీయగా పడివున్న చెఱకు పిప్పిని సేకరించి తిరిగి ప్రధాన దుకాణం వద్దకు చేర్చడం ఈ వాహన చోదకుల పని. అలా తిరిగి వచ్చిన చెఱకు పిప్పిని కంపోస్టు ఎరువుగా తయారు చేసి తన పొలాలకే ఉపయోగిస్తాడు. ఈవిధంగా చేయటం వల్ల ఇతను తన పొలం కోసం కావలసిన ఎరువును కొనవలసిన అవసరం లేకుండా తనకున్న ఆవుల పేడ, మూత్రంతో చెఱకు పిప్పిని కలిపి తన ఎరువు తానే తయారు చేసుకుంటాడు. ఇదంతా ఒక రోజో, ఒక సీజనో కాదు, సంవత్సరంలో మొత్తం 365 రోజులూ ఈ కార్యక్రమం జరుగుతునే ఉంటుంది. ఈ వ్యాపారం అందరిలా సీజన్‌లో మాత్రమే చెఱకు రసం తీసేలా కాకుండా, సంవత్సరం పొడవునా ఈ దుకాణాలు పని చేసేలా శ్రద్ధ తీసుకున్నాడు. సీజన్ సమయంలో అవసరమున్న చోట ఒకరిద్దరు వ్యక్తులను అదనంగా కూడా ఏర్పాటు చేస్తాడు. తన దుకాణాల్లో పనిచేసే వారికి నెలకు 10 నుండి 12 వేల వరకు జీతాలు ఇస్తున్నాడు. సీజన్ లేనప్పుడు ఉన్న వ్యక్తులు కూడా ఖాళీగా ఉండకుండా, తన తోటి రైతుల వద్ద సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులైన కొర్రలు, జొన్నలు, బియ్యం, ఇతర తృణ ధాన్యాలతో పాటు, ప్రధాన కార్యాలయంలో ఒక చెక్క గానుగ కూడా ఏర్పాటు చేసి, దాని ద్వారా స్వచ్ఛమైన సేంద్రియ నూనె తయారు చేసి, ఇవన్నీ అన్ని బ్రాంచీల ద్వారా విక్రయిస్తాడు. ఈ విధంగా చేయటం వల్ల తాను ప్రత్యక్షంగానే కాక, పరోక్షంగా ఎంతోమంది రైతులకు అదనపు ఆదాయాన్ని కూడా సమకూరుస్తున్నాడు. ప్రస్తుతం వీరారెడ్డి రోజువారి వ్యాపారం 30 నుండి 40 వేల వరకు జరుగుతోంది. సీజన్ కాని సమయంలో కూడా తనకు ఏ దుకాణం నుండి ఎటువంటి నష్టం ఇంత వరకు రాలేదని, కనీసం దాని ఖర్చు వరకైనా వచ్చేలా ఏర్పాటు చేసుకున్నాను అంటాడు వీరారెడ్డి.

ఇతను చేసే దినవారి కార్యక్రమాల కోసం అవసరమైన ఏర్పాట్లను చాలా ప్రణాళికాబద్ధంగా చేసుకున్నాడు. మొదట పొలంలో చెఱకు కోసి ప్రధాన దుకాణం పక్కనే ఏర్పాటు చేసుకున్న షెడ్డులోకి చేర్చడం, అక్కడ చెఱుకును అవసరమైన పొడవుకు కత్తిరించడం, చెఱుకుపైన వున్న వగడు, వేర్లు లాంటి అనవసరపు వాటిని తీసివేసి, వాటిని ఉప్పునీటితో శుభ్రం చేసేందుకు అనువుగా నీటి తొట్లు ఏర్పాటు చేశాడు. ఆ తొట్లలో లీటరుకు 5 గ్రాముల చొప్పున ఉప్పును వేసి, ఉప్పునీటిలో రెండు మూడు గంటల పాటు నానబెట్టడం, తర్వాత చెఱుకును శుభ్రం చేసి, వాటిని ఫ్రిజ్‌లలో పట్టే పరిమాణంలో కత్తిరించి, వాహనాలలో చేర్చడం, ఆ వాహనాలు వాటిని తీసుకుని దుకాణాలకు చేర్చడం, అక్కడ వున్న పిప్పిని తిరిగి తీసుకు రావటం ఇదంతా యాంత్రికంగా జరిగేలా ఏర్పాటు చేశాడు వీరారెడ్డి. ఈ పనులన్నిటిలో నాణ్యతా ప్రమాణాలు తప్పకుండా పాటిస్తాడు. రసం తీపిగా లేని లేత చెఱకు గడలను తీసివేయటం, పుచ్చులు ఉన్న వాటిని వేరు చేయటం లాంటి సూక్ష్మమైన వివరాలను గుర్తించి, చాలా శ్రద్ధతో తీసివేసేలా చూస్తాడు. చెఱకు నుండి రసాన్ని తీయటానికి సాధారణంగా రోడ్ల ప్రక్కన ఉండేవారిలా మాటిమాటికీ యంత్రంలో పెట్టి, చెఱకును పీల్చి పిప్పి చేయటం లాంటి పనులు చేయడు. తన అధునాత యంత్రాల ద్వారా చెఱకును కేవలం ఒక్కసారి మాత్రమే అందులో వేసి నాణ్యమైన రసం మాత్రమే వినియోగదారుడికి అందిస్తాడు. ఇన్ని నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాడు కనుకనే ఇతని దుకాణాల్లోని చెఱకు రసం ఎంతో రుచిగా ఉంటుందనే పేరును, మెప్పును వినియోగ దారుల నుండి పొంద గలిగాడు. చెఱకును ఉప్పు నీటితో కడగటం ద్వారా ఆ రసంలో రుచి చాలా బావుంటుందనే పేరు గడించాడు.

ఏది చేసినా, తన దుకాణాల్లో కేవలం స్వచ్ఛమైన సేంద్రియ ఉత్పత్తులు మాత్రమే లభిస్తాయి అన్న సంకేతాన్ని వినియోగదారులకు చేరవేయటం వల్ల ఇతను చేసే అన్ని రకాల వాటికి మంచి గిరాకీ ఏర్పడింది. ఈ విధంగా చేయటం వల్ల కూల్ డ్రింకుల పేరుతో హానికరమైన పానీయాలు విక్రయిస్తున్న వారి నుండి పోటీ ఎదుర్కొని ప్రజలకు ఆరోగ్యకరమైన చెఱకు రసాన్ని అందిస్తున్నాడు వీరారెడ్డి. 365 రోజులూ కూల్ డ్రింక్ వ్యాపారులే కాదు, రైతు కూడా శీతల పానీయం



అందించ గలడు అని నిరూపిస్తున్నాడు. మొదట్లో కొద్దిగా గిరాకీ తక్కువగా ఉన్నా ప్రస్తుతం ఓవైపు వర్షం పడుతున్నా, తన చెఱకు రసాన్ని తాగటానికి వినియోగదారులు ఇష్ట పడుతున్నారు అని సగర్వంగా చెప్తాడు వీరారెడ్డి.

ఎక్కువ భాగం రైతులు ఏదో పండించేశాం, దాన్ని తీసుకు వెళ్ళి మార్కెట్లో అమ్మేశాం, వచ్చిన డబ్బు జేబిలో వేసుకున్నాం, లాభం వస్తే సంతోషం, నష్టం వస్తే బాధ ఇంత వరకే ఆలోస్తున్నారు. తాము పండించిన పంటను నేరుగా కాకుండా వాటిని మార్చి, విలువను జోడించి అమ్మాలని ఆలోచించటం లేదు. కష్టం చేయటం రైతు లక్షణం, అదేదో ఇంకొంచెం ఎక్కువ కష్టపడి, తన ఇంట్లోనే వాటికి విలువను జోడించి విక్రయించుకో గలిగితే తాను ఊహించని ఆదాయం పొందవచ్చు. ఇలా చేసుకో గలిగితే ఆదాయం రెండు నుండి ఐదింతలు పెరుగుతుంది అంటాడు వీరారెడ్డి.

వ్యవసాయదారుడు విత్తనం వేసి, మొక్క ఎదిగి, పంట చేతికి వచ్చేంత వరకు అతని పరిస్థితి అనిశ్చితంగా ఉంటుంది. ఇంతవరకు అతను ఒక రకమైన జూదం అంటే రిస్క్ ఆట ఆడేవాడిగా ఉంటాడు. పంట చేతికి వచ్చాక ఇంత రిస్క్ తీసుకున్న తర్వాత వచ్చిన ఫలితం చాలు అనుకుని పంటను వచ్చిన ధరకు అమ్మేసి ఎక్కువ లాభం లేకపోయినా తృప్తి పడుతున్నాడు. కాకపోతే ఇంత రిస్క్ తీసుకుని, అనిశ్చిత భావంతో పండించిన పంటని యదాతథంగా అమ్మకుండా, కొంచెం కష్టపడటం (ఇక్కడ రిస్క్, అనిశ్చిత భావం ఏమీ లేదు) రైతులకు అలవాటే కనుక కొంత అదనంగా కష్టపడి, అవసరమైతే కొద్దిగా ఖర్చు పెట్టి పండించిన పంటను రూపాంతరం చేసి, విలువను జోడించినట్లయితే సాధారణంగా వచ్చే ఆదాయం కన్నా, రెండు నుంచి 5 రెట్ల అధిక ఆదాయం పొందవచ్చు. ఈ విలువను జోడించి, అధిక ఆదాయం పొందటంలో శ్రమ, ఖర్చు తప్ప 'రిస్క్, అనిశ్చితి' అనేవి ఉండవు. మనం శ్రమపడి, ఎంత ఖర్చు పెడితే అంత ఆదాయం ఉంటుంది. ఇక్కడ 'కష్టే ఫలి' అన్న సూత్రం వర్తిస్తుంది కనుక రైతులు తమ ఫలసాయానికి విలువను జోడించి అమ్మటం అలవాటు చేసుకొని అధిక ఆదాయం పొందమని చెపుతోంది 'పల్లెసృజన'.

సాధారణంగా జాతీయ రహదారుల్లో మరో 500 మీటర్లు మీటర్లు లేదా కి.మీ. దూరంలో పెట్రోలు పంపు, హోటలు ఉందన్న సూచనలతో పెద్ద పెద్ద అడ్వర్టయిజ్‌మెంట్ హోర్డింగులు కనబడుతుంటాయి. వీటిలాగే వీరారెడ్డి కూడా 'చెఱకురసం దుకాణం మరో 500 మీటర్ల దూరంలో ఉంది అంటూ రహదారి పక్కనున్న రైతుల పొలాల్లో







వాహన చోదకులకు కనబడేలా పెద్ద పెద్ద హోర్డింగులను కూడా ఏర్పాటు చేసి, వినియోగదారులను ఆకర్షించడం చాలా మంచి ఆలోచన అనిపించింది 'పల్లెసృజన' బృందానికి. వీరారెడ్డి ఇలా చేయటం వల్ల అన్ని ఖర్చులు పోను ఎకరాకు కనీసం 4–5 లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నాను అని సగర్వంగా చెపుతాడు వీరారెడ్డి. ఇతన్ని ఆదర్శంగా తీసుకుని ఆ ప్రాంతంలో చాలామంది రైతులు తమ పంటలకు విలువను జోడించి అమ్ముకోవటం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. (అటువంటి వారిలో 'సత్యనారాయణ రాజు' అనే ఒక రైతు కథను ఈ వ్యాసంలో బాక్స్ ఐటంలో చూడండి).

ప్రతి రైతు ఇలా చేయటం కొద్దిగా కష్టమే, పెద్ద కమతాలు ఉన్న రైతులకు మరీ కష్టం కానీ, సాధించాలన్న పట్టుదల ఉంటే తప్పక సాధించవచ్చు అంటాడు వీరారెడ్డి. ఉదాహరణకు : వరి పండించి, వడ్లు అమ్మకుండా, వాటిని బియ్యం, ఉప్పుడు బియ్యం చేయటం ద్వారా ఇడ్లీ రవ్వ, బియ్యపు పిండి లాంటివి తయారు చేసి దుకాణాలను నేరుగా విక్రయించడం. నువ్వులు పండించే రైతులు నేరుగా నువ్వులను అమ్మకుండా వాటికి కొంత బెల్లం కలిపి, 'గట్టాలు' (చిక్కీ) తయారు చేసి అమ్మటం, కందులు, పెసలు, మినుము లాంటి పప్పు దాన్యాలను నేరుగా విక్రయించకుండా పప్పుగా చేసి అమ్మటం ద్వారా రెండు నుండి నాలుగింతల వరకు ఆదాయం పొందవచ్చు. కాకపోతే వాటి మార్కెటింగ్ విధానాన్ని తెలుసుకోవటం, చేసుకోవటం ద్వారా మాత్రమే ఈ విధంగా అధికంగా సంపాదించవచ్చు. ప్రస్తుతం పల్లెసృజన లాంటి సంస్థలు వెలుగులోకి తెచ్చిన చిన్న చిన్న యంత్రాలు విలువను జోడించటానికి అందుబాటులోకి వచ్చాయి. వాటి ఖరీదు కూడా చాలా తక్కువ. అటువంటి వాటిని సమకూర్చుకుని పండించిన పంటకు విలువను జోడించి అధిక ఆదాయం పొందితే రైతుకు మొదట్లో కొద్దిగా కష్టం అనిపించవచ్చు కానీ, నష్టం ఉండదు, చేసే పద్ధతి, మార్కెటింగ్ బాగా అలవాటు ఐన తర్వాత తిరుగులేని ఆదాయం సమకూరుతుంది అని నమ్మకంగా చెపుతాడు విలువ ఆధారిత ఉత్పత్తుల విక్రయానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన మేడపాటి వీరారెడ్డి.

వీరారెడ్డి బాటలోనే రైతులు, మరీ ముఖ్యంగా సన్న, చిన్నకారు రైతులు ఈ పద్ధతులను పాటించి అదనపు ఆదాయాన్ని సగర్వంగా పొందటంతో పాటు, వినియోగ దారునికి వీలైనంత వరకు నేరుగా, స్వచ్ఛమైన, కల్తీ లేని, విష రహిత ఆహారాన్ని అందించాలని కోరుకుంటూ, సృజనాత్మకత వున్న ఆదర్శ రైతు 'మేడపాటి వీరారెడ్డి'కి అభినందన తెలియజేస్తోంది "పల్లెసృజన".

**మేడపాటి వీరారెడ్డి ఫోన్ నెం. : 9533361515**

# ఖర్చు లేకుండా కరెంటు తియ్యగలమని నిరూపిస్తున్న ఇన్నోవేటర్ "అడిగోపుల రాముడు"



- జమ్మలమడక శశిమోహన్, వీరరాఘవ రెడ్డి

**'పల్లెసృజన' పత్రికలో పూర్తయిపోయి, పని చేస్తున్న ఇన్నోవేషన్‌ల గురించి మాత్రమే వ్రాస్తుంటాము. కానీ చాలాసార్లు మాకు శోధయాత్రలలో కానీ, ఇతరత్రా కానీ కొన్ని ఇన్నోవేషన్‌ల ఆలోచనలు తారస పడుతాయి. అవి వినటానికి సాధ్యమే అనిపించినా, కార్యరూపం దాల్చడానికి చాలా సమయం, ఖర్చు వెచ్చించాల్సి ఉంటుంది. అదేవిధంగా చాలా వాటికి సలహాలు, సంప్రదింపులూ జరపాల్సి వస్తుంది. అటువంటి ఆలోచనలు కార్యరూపం ధరిస్తే మానవాళికి చాలా మేలు జరుగుతుందని మా విశ్వాసం. అందుకే అటువంటి ఆలోచనలని, ఇన్నోవేటర్‌లను 'విచిత్ర ఇన్నోవేటర్లు' అంటుంటాము. అటువంటి విచిత్ర ఇన్నోవేషన్‌ల గురించి కూడా 'పల్లెసృజన' పాఠకులకి తెలియజేస్తే, అదే పంథాలో ఆలోచించే ....లపై అధిక జ్ఞానం ఉన్నవాళ్ళు సదరు ఇన్నోవేటర్ ఆలోచన సాకారం కావటానికి దోహద పడతాయనే ఉద్దేశ్యంతో అటువంటి వాటిని గురించి కూడా .... ప్రచురించ దలచాం. అటువంటిదే ఈ ఇన్నోవేషన్. విజ్ఞులైన పాఠకులు ఈ ఇన్నోవేషన్‌పై తమ ఆలోచనలు నేరుగా ఇన్నోవేటర్‌తో కానీ, పల్లెసృజనతో కానీ పంచుకుంటారని ఆశిస్తూ.....** **- ఎడిటర్.**

"కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బు బిల్ల కాదేదీ కవితకు అనర్హం" అన్నారు 'శ్రీశ్రీ'. అలాగే మనకు కనిపించే ప్రతి వస్తువులో 'ఇన్నోవేషన్' మూలాలను వెతుకుతున్నారు మన పునాది స్థాయి ఇన్నోవేటర్లు. మనకు సాధారణంగా కనిపించే ఒక వస్తువు ఇన్నోవేటర్ దృష్టిలో ఒక ఇన్నోవేషన్‌కు పునాది అవుతుంది. అలా బావిలో నీరు తోడుకోవటానికి ఉపయోగించే తాడు, పుల్లి, బకెట్ల కదలిక నుంచి విద్యుత్ తయారు చేసే యంత్రాన్ని తయారు చేసే ఆలోచన వచ్చింది ప్రకాశం జిల్లా, చీరాల మండలం, తోటవారి పాలెం గ్రామానికి చెందిన 58 సంవత్సరాల 'అడిగోపుల రాముడు' అనే ఇన్నోవేటర్‌కు. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఈ యంత్రానికి ఓ రూపం ఇస్తున్నాడు రాముడు. ఈ ఖర్చు లేని విద్యుత్ తయారీ యంత్రాన్ని గురించిన కథనం 'పల్లెసృజన' పాఠకుల కోసం.....



విద్యుత్ తయారు చేసే ఇన్నోవేషన్‌కు ప్రాథమిక రూపకల్పన ఈ పూసల దండ


అడిగోపుల రాముడు తనకు వచ్చిన ఆలోచనను కార్యరూపంలో నిరూపించటానికి పూసలతో ఒక దండను తయారు చేసి, అది నిరంతరాయంగా తిరుగేలా చేసి, దాని ఆధారంతో ఒక పెద్ద యంత్రానికి రూపకల్పన చేసే పనిలో నిమగ్నమయ్యాడు. ఇది భూమ్యాకర్షణతో పనిచేసే యంత్రం. రాముడు తన ఇన్నోవేషన్ గురించి ఇలా వివరించారు.

"ఈ యంత్రానికి ఎలాంటి ఇంధనమూ అవసరం లేదు. గాలి సహాయం లేనిదే దూది పింజ కూడా కదలదు కానీ ఈ యంత్రం ఇనుప కమ్మీలను ఎడ్డి పడేస్తూ తనకు తానుగా శక్తిని సంపాదించుకుంటూ డైనమాని తిప్పి కరెంటును ఉత్పత్తి చేస్తుంది. ఏ ఊర్లో ఎంత కరెంటు కావాలో అంత కరెంటు తయారయ్యేలా దీన్ని నిర్మించుకోవచ్చు. వాడల్లో, స్టీమర్లలో కూడా దీన్ని ఉపయోగించి, కరెంటు తయారు చేసుకోవచ్చు. కర్మాగారాలను కూడా నడుపుకోవచ్చు. ఈ యంత్రం వలన కరెంటు ఉచితంగా వస్తుంది. యంత్రాన్ని ఒక్కసారి తయారు చేస్తే చాలు అది పని చేస్తూనే ఉంటుంది. అప్పుడప్పుడూ అవసరమైన చిన్న చిన్న రిపేర్లు, నిర్వహణ చేసుకుంటూ ఉంటే చాలు. దీనివలన ఎటువంటి వాయు కాలుష్యంకాని, శబ్ద కాలుష్యంగానీ ఉండవు. ఎంతోమంది శాస్త్రవేత్తలు ఇలాంటి యంత్రాన్ని తయారు చేయాలన్ని ఎన్నో ఏళ్ళుగా ప్రయత్నిస్తునే ఉన్నారు. అయినా కుదరటం లేదు. ఎంతో కొంత ఇంధనాన్ని ఉపయోగించి నడిచేలా యంత్రాలను తయారు చేశారే కాని, ఇలాంటి యంత్రం ఇప్పటి వరకు ఎక్కడా తయారు చెయ్యలేదు. నిరంతరాయంగా కరెంటు ఉత్పత్తి అవుతుంది కాబట్టి దీన్ని నిలువ చేయటానికి బ్యాటరీలు అవసరం లేదు, కరెంటు రవాణాలు మైళ్ళ తరబడి విద్యుత్ తీగలు వేయాల్సిన అవసరం ఉండదు. ఉదా.: శ్రీశైలంలో కరెంటు ఉత్పత్తి చేసి, దాన్ని చీరాలకు చేర్చాలంటే అక్కడ

100 శాతం తయారైన కరెంటు చీరాలకు 70 శాతం మాత్రమే చేరుతుంది. ఏ ఊర్లో కరెంటు ఆ ఊర్లోనే ఉత్పత్తి చేసుకోవచ్చు కాబట్టి దీని తయారీకి, రవాణాకు, నిర్వహణకు ఎటువంటి ఖర్చు అవసరం లేదు. కరెంటు ఉత్పత్తి, సరఫరాల కోసం ఏ ఊర్లో వాళ్ళు ఆ ఊర్లోనే ఉద్యోగాలు పొందవచ్చు. ఆ దేవుని అనుగ్రహం వలన నేను చేయ గలగటం అదృష్టం. అణు విద్యుత్, థర్మల్ విద్యుత్తుల వలన భూమి వేడెక్కుతుంది, వాతావరణంపై తీవ్ర ప్రభావం ఉంటుంది. కాబట్టి ఎటువంటి వాతావరణ నష్టాలు లేకుండా కరెంటు ఉత్పత్తి చేసే ఇలాంటి యంత్రాలు ప్రపంచానికి ఎంతో ముఖ్యం, అవసరం కూడా. అందుకే ఈ యంత్రం ప్రపంచానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తు న్నాడు రాముడు.

సౌర శక్తి (సోలార్) ద్వారా కరెంటు ఉత్పత్తి చేయాలంటే రోజుకు 10 గంటల వరకు మాత్రమే చేయవచ్చు. మిగతా సమయంలో కరెంటు కావాలంటే ఆ ఉత్పత్తి అయిన విద్యుత్తును బ్యాటరీలలో నిక్షిప్తం చేసి వాడుకోవాల్సి ఉంటుంది. ఈ యంత్రం ద్వారా నిరంతరం విద్యుత్తు ఉత్పత్తి అవుతునే ఉంటుంది కాబట్టి ఉత్పత్తి అయిన కరెంటును నిక్షిప్తం చేయాల్సిన అవసరం ఉండదు కాబట్టి దీన్ని నిలువ చేసేందుకు బ్యాటరీలు అవసరం లేదు కాబట్టి బ్యాటరీల నిర్వహణా ఖర్చు కూడా ఉండదు. కాబట్టి ఈ యంత్రాన్ని తయారు చేసి, ఉత్పత్తి చేసినట్లయితే భారతదేశ కీర్తి దశదిశలా వ్యాపిస్తుంది అంటాడు రాముడు.

50 అడుగుల ఎత్తు, 20 అడుగుల వెడల్పుతో ఒక చట్రాన్ని తయారు చేసి, దానికి నాలుగు మూలలా నాలుగు 'గిలక' (పుల్లీ)లు ఏర్పాటు చేశాడు. ఆ పుల్లీలపై పూసల దండలా కనిపించే వాటిని నడిపేందుకు ఒక గాడి చట్రాన్ని తయారు చేశాడు. చట్రానికి మూడు వైపులా ప్రతి పూసకు మధ్యన 10 అడుగుల ఉంటుంది. రెండవ పుల్లి నుంచి మూడవ పుల్లి వరకు చాలా పూసలు ఉంటాయి. ఈ చట్రం ద్వారా పూసల దండ నడిచేందుకు అవసరమైన పళ్ళ చక్రాలను, అవి సూక్ష్మంగా నడిచేందుకు నాలుగు గిలకలకు ఇరువైపుల మొత్తం 8 బేరింగులను ఏర్పాటు చేశాడు. ఒకటో పుల్లి నుంచి రెండో పుల్లి వరకు వెళ్ళే సరికి 10 అడుగుల బెల్టు చుట్టుకోవడం పూర్తి అవగానే బ్రేకు పడిపోతుంది. రెండో పుల్లి నుంచి మూడో పుల్లి క్రిందకి వెళ్ళగానే ఆ బ్రేకు ఊడిపోతుంది. బ్రేకు ఊడగానే 10 అడనగులు చుట్టుకున్న బెల్టు ఊడిపోయి నాలుగో పుల్లి వైపు పూస లాగబడుతుంది. కుడివైపు వున్న పూసలలో నుంచి క్రింద పక్క ఒక పూస ఎడం వైపుకి రాగానే పైన ఒకటో పుల్లి నుంచి రెండో పుల్లికి


రూపకల్పన చేయబడ్డ నమూనా చట్రం


పూసలకు మారుగా చేసిన నమూనా చక్రం

పూస బయలుదేరి మళ్ళీ కుడివైపుకి వచ్చేస్తుంది. ఇలా నిత్యం ఈ కదలిక జరుగుతునే ఉంటుంది. ఈ పూసలు 1వ పుల్లి నుంచి 2వ పుల్లి వరకు 5 పూసలు, 2 నుంచి 3వ పుల్లి వరకు 30 పూసలు, 3వ పుల్లి నుంచి 4వ పుల్లి వరకు 5, మళ్ళీ 4వ పుల్లి నుంచి మొదటి పుల్లి వరకు 5 పూసలు ఇలా ప్రయాణం చేస్తూనే ఉంటాయి. ఈ పూసలు ఒక్కో దాని బరువు 20 కిలోల దాకా ఉంటుంది. మనకు ఎంత కరెంటు ఉత్పత్తి కావాలి అన్న అంచనాను బట్టి ఈ పూసల బరువును 20 నుంచి 100 కిలోల వరకు మార్చుకోవచ్చు. దాన్ని బట్టి మనకు కావలసిన కరెంటు ఉత్పత్తి చేసే డైనమా కూడా మార్చవలసి ఉంటుంది. ఎటువంటి ఇంధనం లేకుండా కేవలం భూమ్యాకర్షణతో పనిచేసే ఈ పద్ధతి వల్ల దేశానికి ఒక్కసారి చేసే ఖర్చుతో సాధారణ నిర్వహణా ఖర్చులతో కరెంటు ఉత్పత్తి చేసి, ఏ గ్రామానికి అవసరమైన విద్యుత్తును ఆ గ్రామంలోనే తయారయ్యేలా ఏర్పాటు చేయవచ్చు అన్నది రాముడు ఆలోచన.

ఒక లోతైన బావికి పైన ఏర్పాటు చేసిన పుల్లిలో ఒక తాడు వేసి, ఆ తాడుకు ఒకవైపు బరువైన బకెటను కట్టి తాడును వదిలితే బావిలోకి భూమ్యాకర్షణ శక్తితో వెళుతుంది అన్న సూత్రంతో తయారు చేయబడింది ఈ విద్యుత్ ఉత్పత్తి చేసే యంత్రం. ఈ సూత్రం ఆధారంగా తయారు చేయబడ్డ ఈ యంత్రంలో కూడా ఒక వైపు ఎక్కువ పూసలు ఉండేలాగ, మిగతా మూడు వైపుల తక్కువ పూసలు ఉండేలాగా ఏర్పాటు చేశాడు. ఎక్కువ పూసల లోంచి తక్కువ పూసల వైపు ఒక్కో పూస బయటకు వస్తూ, అవి చుట్టూ తిరిగి మళ్ళీ ఎక్కువ పూసలు ఉన్నవైపు కదులుతునే ఉంటాయి. ఇవి తిరిగే వేగానికి విద్యుత్ ఉత్పత్తి చేసే డైనమా అనుసంధానం చేయటం ద్వారా విద్యుత్తు ఉత్పత్తి నిరంతరాయంగా అవుతునే ఉంటుంది.

రాముడు తన ఆలోచనను కార్యరూపంలో కి తీసుకు రావటానికి తన శక్తికి మించి ఖర్చు చేశాడు. ఇందులో కొంత ఆర్థిక సహాయాన్ని 'పల్లెసృజన' వ్యవస్థాపకులు బ్రిగేడియర్ గణేశం గారు సమకూర్చగా మిగతా ఖర్చుల కోసం తన ఇంటిని కూడా తాకట్టు పెట్టి ఇప్పటికే లక్ష రూపాయలకు పైగా ఖర్చు చేసి దాదాపు ఈ పరికరాన్ని రూపొందించాడు. ఇది పూర్తి కావటానికి, విద్యుత్ ఉత్పత్తి చేయటానికి ఇంకా కొంత వరకు డబ్బు అవసరం అవుతుంది. ప్రభుత్వం లేదా ఎవరైనా దాతలు ముందుకు వస్తే ఈ పరికరాన్ని పూర్తి చేసి, విద్యుత్ తయారు చేసి ప్రపంచానికి ఈ అపురూపమైన యంత్రాన్ని అందివ్వాలనే పతనతో ఉన్నాడు రాముడు. ఇతని కోరిక త్వరలో నెరవేరి సమాజానికి ఎటువంటి ఖర్చు లేని, విద్యుత్ తీగలు అవసరం లేని కరెంటు లభిస్తుందని ఆశిస్తోందని ఆశిద్దాం.

**ఇన్నోవేటర్ అడిగోపుల రాముడు, ఫోన్ : 96403 02816**

# మన సీరియల్ ఇన్నోవేటర్ 'అల్లాడి ప్రభాకర్'కు రైతునేస్తం పురస్కారం-2022




ప్రతి సంవత్సరం 'రైతునేస్తం' పత్రిక ఏర్పాటు చేసిన "రైతు కోసం పాటుపడుతున్న వారికి ఇస్తున్న 'రైతునేస్తం' పురస్కారం"లో 2022వ సంవత్సరం పురస్కారం మన సీరియల్ ఇన్నోవేటర్ అల్లాడి ప్రభాకర్ ను వరించింది. రైతుల సమస్యలను తీర్చేందుకు వరుస ఇన్నోవేషన్‌లను అందించిన అల్లాడి ప్రభాకర్‌కు ఈ పురస్కారం అందడ సముచితమని 'పల్లెసృజన' భావిస్తోంది.

అల్లాడి ప్రభాకర్ ఇటీవల రూపొందించిన కొబ్బరి పీచు తీసే యంత్రం తయారు చేసినందుకు గాను రైతునేస్తం వారు ప్రభాకర్‌ను ఈ పురస్కారానికి ఎంపిక చేయటం జరిగింది.

ఈ యంత్రం ద్వారా వ్యర్థ కొబ్బరి బోండాముల నుండి 2 రకాల ఉత్పత్తులను తయారు చేయవచ్చు.

**1. కోకో పిత్ :** ఇది పౌడర్ లాగా ఉండి రైతులు పంటలు పండించ డానికి ఎరువుగా తమ పంట పొలాలు, నర్సరీలు, గారెన్స్ మరియు తమ ఇళ్ళల్లో మొక్కలకు ఎరువుగా వాడుతున్నారు. దీనివలన నేలలో నీటి శాతం ఎక్కువ రోజులు ఉండటం వలన పంటలకు, మొక్కలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

**2. కోకో ఫైబర్ :** ఇది వాణిజ్యపరంగా ఎంతో లాభసాటిగా ఉంటుంది. ఈ కొబ్బరి పీచు ద్వారా కొబ్బరి తాళ్ళు, కుర్చీలు, సోఫాలు, ఫాల్స్ సీలింగ్ వంటి వాటి తయారీలో ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఈ 'కోకనట్ ష్రెడ్డర్ మిషన్'ను చిన్న గ్రామాలు, పట్టణాలలో కూడా సులువుగా ఏర్పాటు చేసుకొనే విధంగా ఈ మిషన్‌ను తయారు చేయడం జరిగింది.

- ఈ యంత్రంలో సింగల్ ఫేస్ మరియు 3 ఫేస్ విద్యుత్‌తో నడిచే 3 హార్స్‌పవర్‌ల మోటారు బిగించడమైనది.
- ఈ మిషన్ గంటకు సుమారు 200 కొబ్బరి బోండాంలను క్రష్ చేస్తుంది.
- ఈ యంత్రం ద్వారా చిన్నపాటి పరిశ్రమ ఏర్పాటు చేసుకొని నలుగురు సభ్యులకు ఉపాధి అవకాశాలను సృష్టించుకోవచ్చు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు గ్రామీణ యువత ఉపాధిని కూడా సులభంగా పొందవచ్చు. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో రైతుకు అవసరమైన వివిధ పంటల నారును పోషించి విక్రయించు కునేందుకు 'గ్రీన్‌షేడ్ నర్సరీ'లు ఏర్పాటు చేసుకుంటున్నారు. వాటిల్లో నారు పెంచేందుకు ట్రేలను ఉపయోగిస్తారు. ఆ ట్రేలలో ఈ యంత్రం ద్వారా తయారైన కోకోపిత్‌ను నింపి అందులో నారును పెంచడం ద్వారా నారును చాలా సులభంగా పీకవచ్చు. కోకోపిట్‌తో పాటు వచ్చే కొబ్బరి నారును మీ గ్రామానికే వచ్చి వ్యాపారస్తులు తీసుకు వెళ్తారు.

గ్రామాల్లో కొబ్బరి బోండాంలు, తాటి ముంజల వ్యర్థాలు పేరుకు పోయి అపరిశుభ్రం కాకుండా, వాటినుండి కోకోపిత్ మరియు కొబ్బరి పీచులను తయారు చేయ గలిగితే చాలు. వీటి మార్కెటింగ్ చాలా సులభం. ఇందులో కొబ్బరి బోండాంలే కాదు, తాటి ముంజలు, తాటిచెట్టు, కొబ్బరి చెట్టు, పామోలిన్ చెట్ల ఆకుల మొదళ్ళను కూడా వేసి కోకోపిత్ మరియు పీచులను తయారు చేయవచ్చు.

రైతుకు ఎన్నో విధాలుగా ఉపయోగ పడే ఈ యంత్రం తయారు చేసినందుకు 'అల్లాడి ప్రభాకర్'కు ఈ పురస్కారం లభించటం ముదావహం అనుకుంటోంది 'పల్లెసృజన'. ●



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## విత్తనాలు నాటి ఎరువులు వేసే చేతి పరికరం

### సమస్య - పరిష్కారం :

వ్యవసాయంలో విత్తనాలు వేయటమనేది చాలా ముఖ్యమైన కార్యక్రమం. సరైన సమయంలో, సరైన పద్ధతిలో విత్తనాలు నాటకపోతే మొత్తం పంట దెబ్బతినే ప్రమాదముంది. దీనికి రైతులు వివిధ రకాల పద్ధతులను వాడుతూ వుంటారు. స్థితిమంతులైన రైతులు ట్రాక్టర్లు వాడినా, ఎక్కువ సంఖ్యలో వుండే పేద రైతులు చేతితో విత్తనాలు నాటడం కష్టమైన పనిగానే వుంటుంది. సాంప్రదాయ పద్ధతిలో చేతులతో విత్తనాలు నాటడానికి మనిషి వంగి, చేతితో గుంత చేసి, విత్తనం వేసి మళ్ళీ మట్టిని పూడ్చవలసి వుంటుంది. మరలా రెండవ విత్తనం వేయటానికి ఇదే పద్ధతి అవలంభించాలి. ఇలా కొన్ని వేలు, లక్షల్లో విత్తనాలు వేయాల్సి వుంటుంది. ఇదంతా ఎంతో శ్రమతో కూడుకున్న పని, ఇలా చేయటం వల్ల నడుం నొప్పితో చాలా ఇబ్బంది పడ్డ రైతులు, కూలీలు కూడా ఉన్నారు. ఈ సమస్య పరిష్కారానికి మనిషి వంగి పని చేయాల్సిన అవసరం లేకుండా, నిలబడే గుంత చేసి, విత్తనం వేసి, పూడ్చేసేలా ఒక పరికరాన్ని తయారు చేశాడు గుజరాత్‌కు చెందిన 'మన్సుక్ భాయ్ డిగాని'.





### పరికరం :

ఈ పరికరం ఒక గొట్టం రూపంలో వుండి, క్రింది భాగంలో భూమిలోకి చొచ్చుకొని పోయే విధంగా మొనదేలి వుంటుంది. పై భాగంలో విత్తనాలు, ఎరువులు వేసుకోవటానికి అనువుగా ఒక పెట్టెను ఏర్పాటు చేసి వుంటుంది. ఈ గొట్టంలో స్ప్రింగు అమర్చబడిన ఒక ఇనుప కడ్డీ వుంటుంది. అది పైన ఏర్పాటు చేసిన ఒక లివర్‌ను నొక్కినపుడు విత్తనం డబ్బా తెరుచుకుని విత్తనం నేలలోకి దిగుతుంది, దాన్ని పైకి గుంజి కాలితో మట్టిని మూసివేస్తే సరిపోతుంది. ఇదేవిధంగా ఎరువును కూడా వేసుకోవచ్చు.

### సాంకేతిక వివరాలు :

- మనిషి వంగకుండా పని చేయటానికి వీలుగా ఉంటుంది.
- ఎంత లోతు అవసరమనుకుంటే అంత లోతుగా భూమిలోకి చొప్పించవచ్చు.

**ముఖ్యాంశాలు :**

- దీనితో పని చేయటం చాలా సులువు.
- సమయము, కూలీల ఖర్చులు ఆదా చేసుకోవచ్చు.
- శారీరక శ్రమ చాలా తక్కువ.
- ఒకే రకంగా విత్తనం వేయటం వలన మొలక శాతం పెరిగే అవకాశముంటుంది.
- విత్తనాలు, ఎరువులు వృధా కావు.
- తక్కువ ఖర్చులో పనైపోతుంది.

## వివిధ పంటల నూర్పిడి యంత్రం

**సమస్య – పరిష్కారం :** దేశంలో ఏ మూల వున్న రైతుకైనా ధాన్యం ఎక్కువగా నష్టపోకుండా, శుభ్రమైన గింజలను అందించే నూర్పిడి యంత్రం ఎంతో అవసరం. మార్కెట్లో రకరకాల నూర్పిడి యంత్రాలు అందుబాటులో వున్నా, ఒక్కో పంటకు ఒక్కో రకం యంత్రాలు ఉంటాయి. అవి కూడా ధాన్యం నష్టం ఎక్కువగా జరగకుండా నియంత్రించలేక పోవడమే కాదు, శుభ్రమైన ధాన్యాన్ని కూడా అందించలేవు. ఈ సమస్యలన్నీ పరిష్కరించేందుకు దాదాపు అన్ని రకాల ధాన్యాలను నూర్పిడి చేసేందుకు ఒకే యంత్రం తయారు చేశారు రాజస్థాన్‌కు చెందిన 'మదన్‌లాల్ కుమావత్'. ఈ యంత్రం తక్కువ ధాన్యం నష్టంతో, ఎక్కువ శుభ్రమైన ధాన్యాన్ని రైతుకు అందిస్తుంది.

**పరికరం :** మదన్‌లాల్ బజార్లో లభించే ఇతర నూర్పిడి యంత్రాలలో వుండే ఇబ్బందులన్నింటిని అధిగమిస్తూ, ఎక్కువ సామర్థ్యం కల అనేక రకాలైన పప్పుదినుసు పంటలు, ధాన్యాలే కాక, కొద్దిపాటి మార్పులతో వేరుశనగను కూడా నూర్పిడి చేసుకునే విధంగా దీన్ని రూపొందించాడు. దీనిలో నూర్పిడి చేసుకున్న తర్వాత తిరిగి ఏ రకమైన శుభ్రపరిచే ప్రక్రియ చేపట్టకుండానే నేరుగా మార్కెట్‌కు తరలించవచ్చు. ఒక ధాన్యం నుండి మరో ధాన్యం నూర్పిడి చేసుకునేలా పరికరంలో మార్పు చేయాల్సిన సమయం కూడా పదిహేను నిమిషాలకు మించదు. ధాన్యపు గడ్డి లేదా చొప్పలను కూడా చిన్న చిన్న ముక్కలుగా చేసి ధాన్యంతో పాటు కాకుండా వేరే ద్వారం ద్వారా బయటకు పంపిస్తుందీ యంత్రం.

**సాంకేతిక వివరాలు :**

- ఈ యంత్రంలో మూడు ముఖ్యమైన భాగాలుంటాయి.
- ఒకటి ధాన్యపు గడ్డి, వగైరాలను చొప్పించేది, రెండవది వాటిని ముక్కలుగా చేసేది, మూడవది వృధాను, ధాన్యాన్ని వేరు చేసేవిగా భాగాలుంటాయి.
- ధాన్యాలు మార్పు చెందినపుడు వీటిలో మొదటి భాగంలో మాత్రమే ఆ ధాన్యానికి అనువైన గేరును మార్చాల్సి వుంటుంది.





- యంత్రం కొలతలు : పొడివు – 3.9 మీ., వెడల్పు – 1.9 మీ., ఎత్తు 2 మీటర్ల వరకుంటుంది.
- 5 సిలిండర్ల గేర్ బాక్స్ కలిగి వుంటుంది.
- మూడు డ్రమ్ముల్లో బ్లేడ్లతో కూడిన 3 చక్రాలు అమర్చబడి వుంటాయి.
- యంత్రం మొత్తం రెండు టైర్ల చట్రంపై అమర్చబడి వుంటుంది.
- ఈ యంత్రం సామర్థ్యం గంటకు – గోధుమలు : 18–25 క్వింటాళ్ళు, పప్పు ధాన్యాలు – 14–18 క్వి., బార్లీ : 25–30 క్వి., జొన్నలు – 18–22 క్వి., సోయాబీన్ – 15–20 క్వి., వేరుశనగ – 20–22 క్వి., మొక్కజొన్న – 8–10 క్వి. వరకు నూర్పిడి చేసుకోవచ్చు.

**ముఖ్యాంశాలు :**

- 35 హార్స్‌పవర్‌ల ట్రాక్టర్‌కు కూడా అనుసంధానం చేసుకోవచ్చు.
- అనేక పప్పు దినుసులే కాక, సజ్జలు, జొన్నలు, శనగలు, మెంతులు, బార్లీ, జీలకర్ర, మినుములు, ఆవాలు, సోయాబీన్, వేరుశనగ, పెసర, అలసంద మొదలైన ధాన్యాలను నూర్పిడి చేసుకోవచ్చు.
- వేరుశనగ నూర్పిడి చేయగల ఏకైక యంత్రం ఇది.
- ఒక ధాన్యం నుండి మరో ధాన్యం నూర్పిడికి మార్పు చేయటం చాలా తేలిక, తక్కువ సమయం.
- కత్తిరించడం, నూర్పిడి చేయటం వరుసగా జరిగే యంత్రం.
- ఒక్కో పంటను ఒక్కోరకంగా యంత్రానికి అందించవలసి వుంటుంది.
- పంటను బట్టి యంత్రంలోని బ్లోయర్ వేగాన్ని నియంత్రించుకోవచ్చు.
- నూర్పిడి సామర్థ్యం 99.6%, శుభ్రత సామర్థ్యం 99%, ధాన్యం నష్టం 0.25%, గింజలు పక్కలకు ఎగిరి పోవటం 0.36% లతో ఎంతో సమర్థవంతమైన యంత్రం.

**పురస్కారాలు :**

- ఎన్.ఐ.ఎఫ్. 2001 జాతీయ పురస్కారం పొందింది.

**కావాలనుకున్నవారు సంప్రదించండి :** పల్లెసృజన, ఫోన్ : 040–49253096, సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)



# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి

- వీరరాఘవ రెడ్డి

**గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 73 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.**

**ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.**

## పొలం లోని రాళ్ళను ఏరివేసే యంత్రంతో గ్రామీణ యువతకు ఉపాధి

కొన్ని పొలాలు భూమి ఆనవాళ్ళు కూడా కనపడకుండా రాళ్ళతో నిండి ఉంటాయి. అటువంటి పొలాల్లో పంట దిగుబడి బాగానే ఉన్నా, అందులో విత్తనం వేయాలన్నా, నారు విత్తనం లాంటివి నాటాలన్నా చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఇటువంటి పొలాల్లో పని చేయటానికి కూలీలు కూడా సుముఖత చూపించరు. భూమిని సేద్యం చేయాలన్నా కూడా సాధారణంగా రెండు మూడు సంవత్సరాలు పనిచేసే గడెం సామాన్లను ప్రతి సంవత్సరం పదును పెట్టుకోవాల్సి వస్తుంది. ఈ సామాన్ల అరుగుదల కూడా ఎక్కువగా ఉంటుంది. ఇటువంటి పొలాల్లో రాళ్ళను ఏరివేయించాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఈ సమస్య పరిష్కారానికి ఒక చక్కటి యంత్రాన్ని తయారు చేశాడు తెలంగాణ లోని సంగారెడ్డి జిల్లాకు చెందిన 'దీపక్ రెడ్డి' అనే యువ ఇంజనీర్.

ఈ పని చేయటానికి సాధారణంగా మార్కెట్లో లభించే యంత్రాలు చాలా ఖరీదుతో కూడుకున్నవి అని గ్రహించి, తన ఇంజనీరింగ్ పరిజ్ఞానానికి పదును పెట్టి, తక్కువ ఖరీదులో ఎక్కువ పనితనం ఉండేలా యంత్రాన్ని తయారు చేశాడు దీపక్ రెడ్డి. ఇది ట్రాక్టర్ అనుసంధాన యంత్రం. 55 హార్స్‌పవర్‌ల సామర్థ్యం కల ట్రాక్టర్‌కు దీన్ని అనుసంధానం చేసుకుని పని చేసుకోవాల్సి వస్తుంది.

ఈ యంత్రం పొలంలోని రాళ్ళ మట్టిని సేకరించి, జల్లెడ పట్టి, ఎక్కడి మట్టి అక్కడే పడేస్తూ, రాళ్ళను మాత్రం అందులోనే ఏర్పాటు చేసిన ఒక ట్యాంకులోకి చేరుస్తుంది. పిడికిట్లో ఇమిడేంత సన్నటి రాయితో పాటు, 20 కేజీల బరువు వరకు వున్న అన్ని రకాల రాళ్ళను ఏరివేస్తుంది. పొలంలోని మట్టి ఏమాత్రం బయటకు వెళ్ళకుండా ఎక్కడి మట్టి అక్కడే పడిపోయేలా జల్లెడ పట్టి పొలంలోనే పడేస్తుంది. భూమిని కొద్దిగా లోతుగా త్రవ్వే విధంగా ఒక బ్లేడు ఏర్పాటు చేయబడి వుంటుంది. అలా త్రవ్విన మట్టిని యంత్రం సేకరించుకుని జల్లెడపట్టి, అక్కడే పొలంలో వేస్తుంది. వేరు చేసిన రాళ్ళలో ఇంకా ఏమైనా మట్టి



మిగిలి వుంటే దాన్ని మరో కన్వేయర్ బెల్టు పైకి చేరుస్తుంది. అలా చేర్చటం వల్ల ఇంకా ఆ రాళ్ళలో ఏదైనా మట్టి ఉంటే అది కూడా భూమిపైన పడేలా చేస్తుంది. అంటే రెండు దఫాలుగా సేకరించిన మట్టిని జల్లెడ పట్టి, కేవలం అందులోని రాళ్ళను ఒక కన్వేయర్ బెల్టు ద్వారా యంత్రంలో ఏర్పాటు చేసిన ఒక ట్యాంకులోకి చేరుస్తుంది. అంటే పొలంలోని మట్టి ఏమాత్రం నష్టం జరగకుండా పొలంలోనే ఉండేలా చేస్తుంది. అలా యంత్రంతో సేకరించిన రాళ్ళను రైతుకు అవసరం అనుకుంటే పొలం గట్టునే వేసుకోవచ్చు, అవసరం లేదు అనుకుంటే వాటిని ఒకచోటకు చేర్చుకుంటే ఎవరైనా గృహనిర్మాణం చేసుకునే వాళ్ళు తమ ఇంటి పునాది కోసం వీటిని కొనుగోలు చేస్తారు కాబట్టి అలా ఆ రాళ్ళ ద్వారా అదనపు ఆదాయం కూడా పొందవచ్చు.

ఇలా పొలంలోని రాళ్ళను తీసివేయటం వల్ల పొలం శుభ్రంగా కనపడటంతో పాటు, రాళ్ళ పొలం వల్ల జరిగే నష్టాలను అరికట్టవచ్చు. సాధారణ భూమిలో లాగానే పొలం పనులు చేసుకుని పంటలు సాగు చేసుకోవచ్చు. దీపక్ రెడ్డి ఇప్పటికే 5-6 యంత్రాలను వినియోగ దారులకు అందించటంతో పాటు, తానే స్వయంగా ఒక యంత్రాన్ని ఏర్పాటు చేసుకుని, రైతుల పొలాల్లోని రాళ్ళను ఏరివేసేందుకు కిరాయికి పంపుతూ మంచి ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాడు. ఇతను ఒక ఎకరం పొలంలో రాళ్ళను ఏరివేసేందుకు రూ. 2,500/- వరకు కిరాయి తీసుకుంటాడు. ఈ యంత్రాన్ని ఉపయోగించి తమ పొలంలోని రాళ్ళను తీసివేయించుకున్న రైతులు తమకు ఎంతో మంచి ఉపయోగ కరంగా ఈ యంత్రం ఉందని అతన్ని అభినందిస్తున్నారు. ఇదే రాళ్ళను కూలీలతో ఏరివేయించి, వాటిని పొలం గట్టుకు చేర్చాలంటే సాధారణ రైతు భరించలేని ఖర్చు, పైగా చాలా సమయం, ఎక్కువ మంది కూలీలు, రాళ్ళను పొలం నుండి గట్టుకు చేర్చడానికి ఎద్దుల బండి లేదా ట్రాక్టరు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి ఇది ఎంతో ఖర్చు, కాలయాపనతో కూడుకున్న పని. ఈ పనులన్నిటిని కేవలం ఒక్క ట్రాక్టరు డ్రైవరు లేదా ఒక సహాయకుడు మాత్రమే పొలంలోని రాళ్ళను శుభ్రంగా ఏరి పొలాన్ని సాగుకు అత్యంత అనువుగా తయారు చేస్తారు.

ఒక్క ఎకరం పొలాన్ని కేవలం 2-3 గంటల్లోనే శుభ్రం చేస్తుందీ యంత్రం. అంతే కాకుండా రైతులు పండించే ఆలు మరియు ఇతర భూమిలోపల వేర్ల నుండి దిగుబడి నిచ్చే కంద గడ్డలు, ఇతర




కూరగాయలను కూడా ఈ యంత్రంతో సులభంగా తక్కువ ఖర్చుతో నాణ్యంగా బయటికి తీయించుకోవచ్చు. ఆలు, క్యారెట్, గెన్సు గడ్డల లాంటి కూరగాయలను తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో నూర్పిడి చేసుకోవచ్చు.

కాబట్టి గ్రామీణ యువకులు, ముఖ్యంగా ట్రాక్టర్ కిరాయికి నడుపుతున్న వారు, ఆయా ప్రాంతాల్లోని పొలాల్లో ఎక్కువ రాళ్ళు ఉన్నాయి అనుకునే వారు ఈ యంత్రాన్ని కొనుగోలు చెయ్యటం ద్వారా మీ ప్రాంతంలోని పొలాల్లో వున్న రాళ్ళను ఏరివేయటం, పొలాలను శుభ్రం చేయటం, ఏరిన రాళ్ళను గృహ నిర్మాణదారులకు అమ్ముకో వటం, కంద, క్యారెట్ ఆలుగడ్డ లాంటి పంటలను నూర్పిడి చేయటం ద్వారా లాభదాయకమైన ఉపాధి పొందవచ్చు.

ఈ యంత్రాలను రెండు పద్ధతుల్లో తయారు చేశాడు దీపక్ రెడ్డి. ప్రస్తుతం వీటి ధర పెద్ద యంత్రం రూ. 7 లక్షలు కాగా, చిన్న యంత్రం 5.5 లక్షల ఖరీదుకు అందిస్తున్నాడు. మీ ప్రాంతాల్లో రాళ్ళ పొలాలు ఉన్నట్లయితే, వెంటనే మీకు అనువైన యంత్రాన్ని కొనుగోలు చేసి మీ ట్రాక్టరుతో అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. మీకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు 'పల్లెసృజన' ఎప్పుడూ మీకు తోడుగా ఉంటుంది. ●

**ఇన్నోవేటర్ దీపక్ రెడ్డి, ఫోన్ : 8500054626**



National Innovation Foundation-India

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

## జాతీయ 13 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**



### ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 13వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000**లను వివిధ వర్గాలలో ఇవ్వబడును. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. **7,50,000**లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. **10,000**లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెలికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2023** లోగా మాకు చేరేలా పంపండి.

### దరఖాస్తు దారులకు గమనిక

**వ్యక్తిగతంగా కానీ, సమూహంగా కానీ ఎన్ని ఐడియాలనైనా వ్రాసి పంపవచ్చు.**
**మీ ఐడియా/ ఇన్నోవేషన్/ సాంప్రదాయ జ్ఞానానికి సంబంధించిన సాంకేతిక వివరాలు, ఫొటోలు, వీడియోలు ఏవి వున్నా పంపాలి.**
**దరఖాస్తుదారుడు తన విద్యార్హతలు, మీ వృత్తి వివరాలను తెలియజేయాలి.**
**మీ గుర్తింపు కార్డు (ఆధార్/ ఓటర్ కార్డు/ ప్రభుత్వం నుండి పొందిన ఏదైనా) కాపీని తప్పనిసరిగా జత చేయాలి.**
**మీ పూర్తి పోస్టల్ చిరునామా తప్పనిసరిగా పంపాలి.**

## దరఖాస్తు చేయుటకు చివరి తేది 31 మార్చి, 2023

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 350001/ 02/ 03/ 04/ 05/ 06 Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై https://nif.org.in/announcement/biennial_competition సంప్రదించండి. లేదా **'పల్లెసృజన'** కార్యాలయాన్ని (ఫోన్ : **040-40253096**) సంప్రదించండి.

# జనవరి - ఫిబ్రవరి 2023 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు





ఫిబ్రవరి 10వ తేదీన హైదరాబాద్ లోని 'నాబార్డ్ రీజనల్ కార్యాలయం'లో నాబార్డ్ సిజియం చింతల సుశీల గారి ఆధ్వర్యంలో 'పల్లెసృజన' బృందం 'అగ్రి ఎంటర్‌ప్రెన్యూర్స్ సమావేశం' నిర్వహించినప్పటి చిత్రం.



ఢిల్లీలో ఫిబ్రవరి 18న జరిగిన జి-20 ప్రసిడెన్సీ ఆఫ్ భారత్ కార్యక్రమాలలో భాగంగా "భారతీయ అభివృద్ధిలో సివిల్ సొసైటీ సంస్థల బాధ్యత" కార్యక్రమంలో 'పల్లెసృజన' వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు ప్రసంగిస్తున్న చిత్రం.





28 ఫిబ్రవరి, 2023న 'ఎఎల్‌సి-ఇండియా' ఆధ్వర్యంలో 40 మంది మహిళా ఎంటర్‌ప్రెన్యూర్స్ 'పల్లెసృజన' కార్యాలయం సందర్శించినప్పటి చిత్రం

## కొల్హాపూర్ 'కనేరి' మఠంలో ప్రదర్శించిన 'పల్లెసృజన' ఇన్నోవేషన్లలో కొన్ని















# కొల్హాపూర్ సమీపంలో 'కనేరి సిద్ధగిరి మఠం' లో 'పంచభూత లోకోత్సవం'లో 'పల్లెసృజన' ఇన్నోవేషన్ల ప్రదర్శన

- జమ్మలమడక శశిమోహన్




దక్షిణ మహారాష్ట్రలో వున్న కొల్హాపూర్ పట్టణం అనేక విషయాలలో ప్రసిద్ధి పొందింది. శక్తి పీఠాలలో ఒకటైన మహాలక్ష్మి అమ్మవారి గుడితో పాటు, శివాజీ చక్రవర్తి వారసులకి కొంత కాలం రాజధానిగా వున్న కొల్హాపూర్, మహారాష్ట్రతో పాటు చుట్టు ప్రక్కల రాష్ట్రాలకు కూడా వాణిజ్య కేంద్రంగా ఉంటోంది. ఈ కొల్హాపూర్‌కి సుమారు 12 కి.మీ. దూరంలో కనేరి మఠం ఉన్నది. దీని ప్రస్తుత మఠాధిపతి అదృశ్యకాడ శ్రీ సిద్ధేశ్వర్ స్వామి అనేక ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు నడుపుతూ ప్రజలకి మార్గదర్శకంగా ఉన్నారు. కొన్ని వందల ఎకరాల విస్తీర్ణంలో వున్న ఈ మఠంలో వ్యవసాయంతో పాటు, అన్ని వసతులు కల వైద్యశాల, మ్యూజియం, ఐదు వందల పశువులు కల గోశాల, అనేక దేవాలయాలు, గురుకులం, శిక్షణా సంస్థలు, ఉపాధి కేంద్రాలు, ఆధ్యాత్మిక ధ్యాన మందిరాలు, కృషి విజ్ఞాన కేంద్రం మొదలైనవి ఉన్నవి.

మఠం కార్యక్రమాలలో భాగంగా కొన్ని వేల మందికి వివిధ వృత్తులలో శిక్షణ ఇవ్వటమే కాక, ఉపాధి అవకాశాలు కూడా కల్పించడం జరుగుతోంది. వారు నడిపే అత్యాధునిక వైద్యశాలలో గ్రామస్తుల చిన్న, పెద్ద రుగ్మతలకి ఉచిత వైద్యం అందజేయ బడుతోంది. పాఠశాలలు, విద్యాలయాలు, శిక్షణా సంస్థలలో ఉన్నత విద్య చదువుకునే సదుపాయం ఉంది. గోశాలలోని పాలు మఠంలో నివసిస్తున్న అనేక వందల మంది ఉద్యోగస్తులు, స్వచ్ఛంద కార్యకర్తలకే కాక, దగ్గరలోని కొల్హాపూర్‌కి కూడా ట్యాంకర్ల ద్వారా పంపడం జరుగుతోంది. సంస్థ పేరున అనేక విక్రయ కేంద్రాలు, సూపర్ బజార్లు నడుపుతూ శ్రద్ధాళుల ఆధ్యాత్మిక తృష్ణతో పాటు, ఆర్థిక అవసరాలు కూడా తీర్చే ప్రయత్నం చేస్తున్నదీ మఠం. మఠంలో నెలకొన్న మ్యూజియంలో సమకాలీన సామాజిక దృశ్యాలు, పండుగలు, కార్యక్రమాలు విగ్రహాల రూపంలో పొందు పర్చటం జరిగింది. వీటిలో సామాజిక స్పృహతో పాటు, దేశ భక్తిని గుర్తు చేస్తూ జలియన్ వాలా బాగ్, ఉప్పు సత్యాగ్రహ శిల్పాలతో పాటు, అనేక జాతీయ నాయకుల విగ్రహాలు ఉన్నాయి. మఠంలో అడుగడుగునా ధ్యాన మందిరాలతో పాటు, వ్యవసాయంలో కానవచ్చే అనేక కార్యక్రమాల విగ్రహాలు, శిల్పాల రూపంలో పొందుపర్చ బడ్డాయి. ఇవన్నీ కూడా నిజమైన గ్రామీణ వనితలు, రైతులు, పశువులు జీవం పోసుకుని ఉన్నాయా అన్నంత సహజంగా మలచబడ్డాయి.

ఈ మఠం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఒక మహోత్సవం జరుగుతూ ఉంటుంది. ఈ సంవత్సరం (2023) 'సుమంగళ పంచ భూత లోకోత్సవం' పేరిట వారం రోజుల పాటు అతి వైభవంగా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ ప్రదర్శనను 20వ తేదీ మహారాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు ఏక్‌రాథ్ షిండే గారు తమ మంత్రివర్గ సహచరులతో విచ్చేసి ప్రారంభిస్తూ, ప్రత్యేకించి ఆరోగ్య గ్యాలరీ, ఆకాశ గ్యాలరీ, వాయు గ్యాలరీ, జల గ్యాలరీ, పృథ్వీ గ్యాలరీలను ఆవిష్కరించారు. ఫిబ్రవరి 20న ప్రారంభించబడిన ఈ ఉత్సవాల్లో భాగంగా 21న 'ఆకాశ తత్వం', 22న 'వాయుతత్వం', 23న 'అగ్ని తత్వం', 24న 'జల తత్వం', 25న 'పృథ్వీ తత్వం' పేరున సభలు, సమావేశాలు నిర్వహించి, ఈ పంచ భూతాలను కాపాడుకోవటానికి








మన ఇన్నోవేషన్లను గురించి
శ్రీ సిద్దేశ్వర్ స్వామి వారికి వివరిస్తున్న బ్రిగేడియర్ గణేశం గారు

మనం ఏమి చేయాలి?, మనవంతు పాత్ర ఏమిటి?, ఈ పంచ భూతాలు లోకంలో సుస్థిరత, సౌభాగ్యాలు రక్షించటానికి ఎంత ముఖ్యమైన పాత్ర వహిస్తున్నాయి మొదలైన అనేక విషయాలపై జాతీయ, అంతర్జాతీయ స్థాయి గల అనేక మంది శాస్త్రవేత్తలు, విశ్వ విద్యాలయాల ఉప కులపతులు, డాక్టర్లు, ఇంజనీర్లు, సామాజిక స్పృహ కలిగిన అనేక మంది సేవకులు, నిష్ణాతులతో సదస్సులు, ప్రవచనాలు, ఉపన్యాసాలు, చర్చలు నిర్వహించారు.



ఈ మహోత్సవాలలో పాల్గొనటానికి చుట్టు ప్రక్కల రాష్ట్రాలు, గ్రామాల నుండి లక్షలాది మంది భక్తులు, శ్రద్ధాళులు, సామాన్యులు, ఆశ్రమానికి విచ్చేశారు. వీరందరికీ ఉచిత నివాస, భోజన సదుపాయాలు ఆశ్రమం తరుపున ఏర్పాటు చేయటం జరిగింది. ఇన్ని లక్షల మంది వచ్చినా ఎవ్వరికీ ఏవిధమైన ఇబ్బందీ కలగకుండా చూసుకోవటానికి వేల మంది స్వచ్ఛందంగా, ఐచ్ఛికంగా వాలంటీర్లుగా పని చేయటానికి ముందుకు వచ్చారు.

ఒకపక్క పంచ తత్వాలపై సదస్సులు, సమావేశాలు జరుగుతూ ఉండగా, భక్తులు పూజలు, పునస్కారాలు చేసుకుంటూ ఉండగా, వీరందరికీ అందుబాటులో ఉండేలా సుమారు 3వేల వివిధ వస్తువులు అమ్మే స్టాల్స్ (విక్రయ కేంద్రాలు) ఏర్పాటు చేయటం జరిగింది. వీటిలో గుండు సూది నుండి, ట్రాక్టరు వరకు నిత్య జీవితంలో మనందరికీ అవసరమైన వస్తువులతో పాటు, అనేక ప్రాంతాలకు చెందిన ఆహార పదార్థాల విక్రయం కూడా జరిగింది. స్టాల్స్ దర్శించే వారికి ఎండ తగలకుండా మొత్తం స్టాల్స్‌ను విమానాలు పట్టేంత టెంట్లు ఏర్పాటు చేసి, వాటిలో నిర్వహించడం జరిగింది. ఇందులో ప్రకృతిసిద్ధ ఆహార





పంటలకి ప్రాముఖ్యతనివ్వటం ప్రత్యేకత.

మఠం వారి ప్రత్యేక ఆహ్వానంపై 'పల్లెసృజన' ఈ ప్రదర్శనలో పాల్గొన్నది. దీనికై సుమారు 25 మంది ఇన్నోవేటర్లు 40కి పైగా ఇన్నోవేషన్లను ప్రదర్శించారు. బ్రిగేడియర్ గణేశం గారు, సుభాష్ చందర్‌ల ఆధ్వర్యంలో మన తెలుగు ఇన్నోవేటర్లు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రదర్శనలో పాల్గొనేలా చర్యలు తీసుకున్నారు. 'పల్లెసృజన' తరుఫున పత్రిక సంపాదకులు జమ్మలమడక శశిమోహన్, ఉప సంపాదకులు వీరరాఘవ రెడ్డి, గ్రామ బజార్ తరుపున జాగర్లమూడి దుర్గాప్రసాద్, వినోద్ లు హాజరయ్యారు. పత్రిక సంపాదకవర్గ సభ్యురాలు శ్రీమతి అరుణ కూడా పాల్గొన్నారు. వారం రోజుల పాటు పండుగ వాతావరణంలో జరిగిన ప్రదర్శనలో లక్షలాది మంది సందర్శకులు ఈ స్టాల్స్‌ని, ఇన్నోవేటర్లని కలిసి ముఖాముఖి సంభాషించి, అనేక విషయాలు తెలుసుకోవటం జరిగింది. ఈ ప్రదర్శనకి ఇంతటి ప్రాముఖ్యత ఎందుకు కలిగింది? అని ఆలోచిస్తే, ఆశ్రమం తరుఫున కొన్ని వేల మంది చిన్న, పెద్ద వ్యాపారస్తులకి వారి వస్తువులు, ఉత్పత్తులని, ఇన్నోవేషన్లని కొన్ని లక్షల మందికి ఒకేసారి చూపించి, ప్రదర్శించి, వ్యాపారం చేసుకునే అవకాశం కలిగింది. ఈ 7 రోజుల ఉత్సవ ప్రద్శనలో కొన్ని కోట్ల రూపాయల వ్యాపారం జరిగి ఉండవచ్చు. పైగా తయారీదారులు, విక్రయదారులు మరియు కొనుగోలు దారులని ఒకేచోట కలిపే ఇట్టి బృహత్కర కార్యక్రమం చేపట్టిన ఆశ్రమానికి అందరూ సదా కృతజ్ఞులై ఉండాలి. ఈ ప్రదర్శనలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి ప్రదర్శించిన ఇన్నోవేషన్లు ప్రత్యేకంగా నిలిచాయి. విక్రయాల సంగతి ఎలా ఉన్నా, తెలుగు రాష్ట్రాలలో వ్యవసాయ తదితర రంగాలలో పునాది స్థాయి ఇన్నోవేటర్లు ఎంత చురుగ్గా పని చేస్తున్నారో ప్రపంచానికి తెలియజేయటానికి ఈ ప్రదర్శన దోహద పడింది. ఈ పండుగలో పాల్గొన్న మన ఇన్నోవేటర్లు అందరూ తమకి ఒక కొత్త అనుభూతి కలిగిందని, ఇన్ని లక్షల మంది సందర్శించిన ఉత్సవంలో తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించే అవకాశం చాలా అరుదుగా వస్తుందని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ●

# సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు (ఇన్నోవే షన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత పదిహేడు సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయ పరంగా ఎంతో లాభం చేకూరింది. ఈ ప్రయాణంలో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరుతుందని భావిస్తున్నాం.

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము.

వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866001678, సుభాష్ చందర్, 9652801700

# ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం

'హనీబీ' ఆంగ్ల పత్రిక సౌజన్యంతో

**323401**

**పంటల సస్యరక్షణకు సేంద్రియ పద్ధతి :**

గుజరాత్ రాష్ట్రంలోని గిర్ సోమ్‌నాథ్ జిల్లా, వాగ్ గ్రామానికి చెందిన 'సర్మన్ భాయ్ హీరాబాయ్' తన పొలంలో పంటను, చెట్లను రక్షించుకోవటానికి తానే స్వంతంగా తయారు చేసుకున్న కషాయాన్ని వాడుతాడు. ఆయన గత 3 సంవత్సరాలుగా ఈ పద్ధతిని ఉపయోగిస్తూ, మంచి ఫలితాలను పొందుతున్నాడు. పంటలను చీడ పీడల నుండి రక్షించుకోవటానికి ఇది చాలా సులభమైన పద్ధతి అని చెప్తాడాయన. ఆయన తన పొలంలో ప్రముఖంగా వేరుశనగ, గోధుమ, మినుము, పెసలు, కొబ్బరి, చెఱకు పంటలు వేస్తూ ఉంటాడు. ఈ పంటలపై దాడి చేసే గొంగళి పురుగులు, పేనుబంక, రసం పీల్చే పురుగు, తెల్లదోమ మొదలైె వాటి నుండి రక్షించుకోవటానికి తన స్వంతంగా చేసుకున్న కషాయాన్ని పంటపై పిచికారి చేస్తాడు.

ఈ ద్రావకాన్ని చేయటానికి అతను మందార, చామంతి, కలబంద, కానుగ, జిల్లేడు, ఉమ్మెత్త, మారేడు (బిల్వ) ఆకులను ఒక్కోటి ఒక కిలో చొప్పున సేకరించి, వాటితో పాటు, రెండు కిలోల వేప ఆకులను, 500 గ్రాముల పచ్చి మిరప కాయలు, 500 గ్రా. అల్లము, 250 గ్రా. వెల్లుల్లి, 10 గ్రా. ఇంగువలను సేకరించి, వీటన్నిటిని రోట్లో వేసి మెత్తగా దంచి, ఈ మిశ్రమాన్ని 100 లీటర్ల గోమూత్రంలో నానబెడ్తాడు. 7 రోజుల తర్వాత 8వ రోజు ఈ ద్రావకాన్ని వడకట్టి భద్రపరచుకుంటాడు. ఈ విధంగా తయారైన ద్రావకాన్ని 8 నెలల వరకు ఉపయోగించుకోవచ్చు.

సర్మన్ భాయ్ 20 లీటర్ల సామర్థ్యమున్న స్ప్రేయర్‌లో అలా తయారు చేసుకున్న 500 మి.లీ. ద్రావకాన్ని కలిపి పురుగుల తీవ్రతను బట్టి 20 రోజుల్లో పంటలపై 3 నుండి 4 సార్లు పిచికారి చేస్తాడు.

ఇలా చేయటం వల్ల తన పంటలను అనేక రకాల క్రిమి కీటకాల నుంచి రక్షించుకుని మంచి దిగుబడిని సాధిస్తున్నాడు.

**323402**

**పంటలకి తెగుళ్ళు, చీడపీడలు సోకకుండా ముందస్తు చర్యగా సేంద్రియ ద్రావకం :**

గుజరాత్ రాష్ట్రానికి చెందిన, జునాగడ్ జిల్లా, ట్యాంక్ రాజేసర్ గ్రామానికి చెందిన 'జమునాభాయ్ ప్రేమ్‌జీ భాయ్' అనే రైతుకు సేంద్రియ పద్ధతిలో పంటలకు సస్యరక్షణ చేసుకోవటం చాలా ఇష్టం. భూసారం కోల్పోకుండా, నిరంతరం పంట పండించుకోవాలి అంటే, సేంద్రియ పద్ధతి ఉత్తమం అని నమ్మే రైతు అతను.

ఈయన తన పంటలను పేనుబంక నుండి రక్షించుకోవటానికి వేప గానుగ చెక్క, ఆముదపు గానుగ చెక్కలను జీవామృతంలో కలిపి వాడుతూ ఉంటాడు.

ఈయన తన పంటలను రక్షించుకోవటానికి తానే స్వయంగా సేంద్రియ కషాయాలను తయారు చేసుకుంటాడు. దానికతను తలంబ్రాల చెట్టు, వేప, జిల్లేడు, కలబంద, సీతాఫలం చెట్ల ఆకులను ఒక్కోటి 2 కిలోల చొప్పున తీసుకుని కచ్చ పచ్చగా దంచి ఆ మిశ్రమాన్ని 200 లీటర్ల నీటిలో 10 రోజుల పాటు నానబెట్టాలి. ఆ తర్వాత ద్రావకాన్ని వడకట్టిన తర్వాత వేరుశనగ, కొత్తిమీర, గోధుమ, కంది, నువ్వులు, పెసర, సజ్జ మరియు అన్ని రకాల కూరగాయల పంటలపై





10 – 15 రోజుల వ్యవధిలో పిచికారి చేస్తే, పంటకు ఎటువంటి చీడ పీడలు సోకవట.

జమునాభాయ్ తన కంది పంటను పురుగుల నుండి రక్షించు కోవటానికి పుల్లటి మజ్జిగలో సీతాఫలం ఆకులను 10 రోజుల పాటు నానబెట్టి, ఆ ద్రావకాన్ని పంటలపై పిచికారి చేస్తారు. అదేవిధంగా ఎరువుగా వాడటానికి తన పొలంలో కలుపు మొక్కలను ఒక గుంటలో వేసి, దానిలో ఆవుపేడ, ఆవు మూత్రం కలిపి కొన్నాళ్ళపాటు ఉంచిన తర్వాత ఆ మిశ్రమాన్ని పిచికారికి ఉపయోగిస్తారు.

ఈయన తన 20 ఎకరాల పొలానికి దుగ్గిక, టేకు, వేప, వావిలి, సీతాఫలం, నార చెట్లు, తంగేడు మొదలైన ఔషధ గుణాలు కల చెట్లు, మొక్కలను కంచెగా వేశాడు. దీంతో ఇతని పొలానికి కావలసిన రక్షణతో పాటు, క్రిమి సంహారక మందులు తయారు చేసుకోవటానికి అవసరమైన ముడి సరుకు కూడా దొరుకుతుంది. చెట్లపైన ఆవాసం ఏర్పరచుకొన్న పక్షులు, పొలంలోని క్రిమి కీటకాదులను తినివేస్తాయి.

ఈ రైతు తన గిర్ గోవుల ఆహారం కొరకు జొన్న పంట స్వయంగా పండించుకుంటాడు. పశువుల దాణాగా పత్తిగింజలు, మొక్క జొన్న పిండి కలిపి తినిపిస్తాడు. కొత్తగా దూడ పుట్టినపుడు తల్లి పశువుకి 500 గ్రా. ఉడకబెట్టిన సజ్జలు, 300 గ్రా. బెల్లము, 200 గ్రా. ఆహార నూనె కలిపి 15–20 రోజుల పాటు వరుసగా తినిపిస్తాడు. ఈ విధమైన ఆహారం ఇవ్వటం వలన తల్లి పశువు త్వరగా కోలుకొని, దూడకి సమృద్ధిగా పాలు ఇవ్వగలుగుతుంది.

తనవద్దనున్న పశువులకి పేను, పిరుదులు, గోమారి మొదలైన వాటినుండి రక్షించడం కోసం వావిలి, వేప, సీతాఫల చెట్ల ఆకులను ఉపయోగిస్తారు. ఈ మూడు ఆకులను నీటిలో బాగా ఉడకబెట్టి, చల్లారిన తర్వాత ఒక గుడ్డను ఆ నీటిలో ముంచి పశువులకు బాధ కలిగే ప్రదేశాల్లో ఆ తడిగుడ్డతో తుడుస్తాడు దానివల్ల పశువుకు వాటినుండి నివారణ కలుగుతుంది. ఇంతే కాక, ఈ నీటి మిశ్రమాన్ని మళ్ళీ పశువులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, పశువుల కొట్టంలో చల్లుతారు. దాంతో కొట్టం శుభ్రంగా మారి మళ్ళీ పశువులకు పిరుదులు, గోమారి లాంటివి సోకకుండా ఉంటాయి.

**323405**

**పొట్లకాయ పంటలో రసం పీల్చే పురుగు నియంత్రణ :**

గుజరాత్ రాష్ట్రం, సూరత్ జిల్లాకు, ఎర్థాన్ గ్రామ నివాసి 'మహేష్ భాయ్ బాబూ భాయ్ పటేల్' బీర, పొట్ల మొదలైన కూరగాయ పంటలను తానే స్వయంగా తయారు చేసుకున్న పద్ధతిని వాడి కాపాడుకుంటూ ఉంటాడు.

పంటలలో ఎండిన సొరకాయ విత్తనాలు గాలి వీచని



సమయంలో బొగ్గులపై కాల్చి ఆ పొగ పంటకు పట్టిస్తే సొరకాయ తీగలకు పట్టే రసంపీల్చే పురుగులను నివారించవచ్చు. ఇదేవిధంగా సొరకాయ విత్తనాలతో పాటు నేల వేము ఆకుల, కొమ్మల పొడి మరియు ఎండిన నేల గలివిడి ఆకులు కూడా కలిపి పొగ పెడితే ఇంకా మంచి ఫలితాలు ఉంటాయి అంటాడు మహేష్ భాయ్. ఈ పద్ధతి వలన పూర్తిగా పురుగును నివారించలేక పోయినా, గణనీయంగా తగ్గించవచ్చు అంటాడాయన.

ఒక గోనె సంచిలో పండిన వేపగింజలను నింపి, గోనెసంచిని మూత కట్టి, గింజలను బాగా చితక్కొట్టి, మొత్తం సంచిని 100 లీటర్ల గోమూత్రంలో 24 గంటల పాటు ఉంచితే మంచి చీడ నివారణ మందు తయారవుతుంది. ఈ ద్రావకాన్ని 15 లీటర్ల నీటిలో 500 మి.లీ. ద్రావకాన్ని కలిపి పంటలపై పిచికారి చేస్తే చాలావరకు చీడలను నివారించవచ్చు.

మామిడి తోటలలో చెట్లు చిన్నగా ఉన్నపుడు పందులు వచ్చి, చెట్లను తోడి చాలా నష్టం కలిగిస్తాయి. దీన్ని నివారించడానికి మామిడి చెట్ల వరుసల మధ్య పసుపు, అల్లము, నల్ల జీలకర్ర మొదలైన ఘాటైన వాసనలు కల చెట్లను నాటితే ఆ వాసనల ఘాటైన వాసనల వల్ల చాలావరకు పందులని రాకుండా నివారించ వచ్చు.

సొరకాయ (అనపకాయ) తీగకు మూడవ, నాలుగవ కణుపులలో సూదితో చిన్న రంధ్రం చేసి, ఆ రంధ్రంలో ఇంగువ పొడిని అద్దినట్లయితే మంచి కాపు కాస్తుందట!

సొరకాయల దిగుబడి అధికంగా రావాలి అంటే 200 లీటర్ల నీటిలో 250 గ్రా. ఇంగువను కలిపి, ఆ మిశ్రమాన్ని పంటపై పిచికారి చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

రెండు ఆకుపచ్చని కొబ్బరి బోండాల నీళ్ళలో 15 లీటర్ల మామూలు నీటిని కలిపి సొరకాయ తీగ మొదళ్ళ వద్ద కొద్దిగా పోసినట్లయితే ఎక్కువ దిగుబడి వస్తుంది.

పొలాలకు హాని కలిగించే కీటకాల నుండి రక్షించుకోవాలి అంటే మహేష్ భాయ్ తాను ఉపయోగించే ఉపాయం చెప్తున్నాడు. ఒక కిలో వెల్లుల్లిపాయలను పొట్టు తీసి, బాగా నలగకొట్టి, ఒక లీటర్ కిరోసిన్ లో 24 గంటల పాటు ఉంచిన తర్వాత ఆ ద్రావకాన్ని వడకట్టి (వెల్లుల్లి పాయలను తీసివేసి) ఒక కిలో కారము, 2 కిలోల పొగాకు పొడి కలిపి కొన్ని గంటల తర్వాత వడకట్టాలి. ఈ ద్రావకాన్ని 250 మి.లీ. తీసుకొని 15 లీటర్ల నీటిలో కలిపి పంటలపై పిచికారి చేస్తే పంటలకి నష్టం కలిగించే క్రిమి కీటకాల నుండి రక్షణ పొందవచ్చు.

ఏదైనా పంట అధిక దిగుబడిని ఇవ్వాలంటే ఈ చిట్కా ఉపయోగించ మంటాడు మహేష్ భాయ్. పది ఆవు పేడతో చేసిన పిడకలను ఒక నీళ్ళ డ్రమ్ములో 24 గంటల పాటు నానబెడితే ఆ ద్రావకంలోకి 'హ్యూమిక్ ఆసిడ్' చేరుతుంది. ఈ ద్రావకాన్ని ఒక లీటరు తీసుకొని దాన్ని 15 లీటర్ల నీటితో కలిపి పంటలపై పిచికారి చేస్తే మామూలుగా వచ్చే దిగుబడికన్నా అధిక దిగుబడి వస్తుందట!

**323408**

**టమోట పంటలో ఆకుముడత తెగులు నివారణ :**

గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్ జిల్లా, బిలోద్ర గ్రామానికి చెందిన 'ఇందర్‌జిత్ సర్దార్ సింగ్' తన టమోట పంటలో ఆకుముడత తెగులు నివారణకు తానే తయారు చేసుకున్న ఈ క్రింది చిట్కాను ఉపయోగిస్తూ ఉంటాడు. 5 కిలోల వాక్కాయ (కలింకాయ) లని నీటిలో

బాగా ఉడకబెట్టి, చల్లారిన తర్వాత వాటిని ఒక గోనెసంచిలో వేసి, మూటకట్టి 60 లీటర్ల నీటిలో ఉంచాలి. ఒక వారం తర్వాత గోనె సంచిని తీసివేసి, ఆ నీటిలో 10 కిలోల తాజా ఆవుపేడను, 5 లీటర్ల గోమూత్రాన్ని కలిపి 8 నుండి 10 రోజుల వరకు మురగబెట్టాలి. తర్వాత ఈ ద్రావకాన్ని డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి ద్వారా చెట్లకు అందిస్తే, ఆకు ముడత తెగులు ను చాలా వరకు నివారించవచ్చు.

ఈ ఆకుముడత తెగులు నివారణకి మరో మార్గం పొలానికి తక్కువ నీరు పెట్టడం లేదా రోజు విడిచి రోజు, వరుస మార్చి నీరు పెడుతూ ఉండాలట.

**రెండుసార్లు నాటు వేయటం ద్వారా 'క్యాబేజి, క్యాలిఫ్లవర్' పంటల అధికోత్పత్తి:**

ఒరిస్సాలోని సుందర్ ఘర్ ప్రాంతంలోని స్థానిక కొండజాతివారు క్యాలిఫ్లవర్, క్యాబేజి పంటల అధికోత్పత్తికి ఈ పద్ధతిని ఉపయోగిస్తున్నారు. ముందుగా విత్తనాలను నారుమడిలో పోసి, మూరాకు మొలకెత్తిన తర్వాత ఆ మొలకలను జాగ్రత్తగా తీసి ఇంకొక మడిలో నాటాలి. అక్కడ మొక్కకి దాదాపు ఎనిమిది ఆకులు వచ్చేవరకు ఉంచాలి. ఆ తర్వాత వాటిని తీసి పొలంలో నాటినచో ఆ మొక్క బలంగా, ఆరోగ్యంగా ఉండటంతో పాటు, అధికోత్పత్తిని ఇస్తాయి. షెడ్యూల్డు తెగలకు చెందిన రైతు గణనాథ గత కొన్ని సంవత్సరాలుగా ఈ పద్ధతిని ఉపయోగించి, అధికోత్పత్తిని సాధించాడు.



**కాకర ఆకుల రసంతో పశువుల పుండ్లకు వైద్యం:**

పశువులకు దెబ్బలు, పుండ్లను అలాగే వదిలేస్తే అవి చీము పట్టి సెప్టిక్ అయ్యే ప్రమాదముంది. ఒరిస్సాలోని తర్చర్ అనే గ్రామ ప్రజలు తాజా కాకర ఆకులను మెత్తగా దంచి, ఆ ముద్దను పశువుల పుండ్లు, గాయాలపై పూయటం ద్వారా అవి త్వరగా మానిపోవటం జరుగుతోంది. దీనివలన గాయాలు త్వరగా మానటమే కాకుండా, క్రిమి కీటకాలను కూడా దరి చేరకుండా నిరోధిస్తుంది. ముద్దగానే కాకుండా కాకర ఆకులను చేతితో నలిపి ఆ రసాన్ని గాయంపై వేస్తే కూడా గుణం కనిపిస్తుంది. ప్రకాష్ అనే రైతు ఈ పద్ధతిలో చాలా పశువులకు ఉపశమనం కలిగించాడు.



**నిమ్మజాతికి చెందిన దబ్బ (కర్ణ) కాయ చెట్ల ఆకులతో పశువులలో నులిపురుగుల నివారణ:**

ఒరిస్సా రాష్ట్రంలోని పూరి, అంగూల్, కలహంది ప్రాంతాల్లోని ప్రజలు దబ్బ (కర్ణ) కాయలను ఆహారంలో వాడుతారు. కానీ లక్ష్మీబెన్ (60 సం.) ఈ చెట్ల ఆకులను పశువులలో నులి పురుగుల నివారణకు వాడుతుంది. ఆమె మూడు నాలుగు ఆకుల రసానికి కొద్దిగా ఉప్పు కలిపి, 150 మి.లీ. నీటిలో కలిపి జ్యూస్ తయారు చేసి పశువులచేత తాగిపిస్తుంది. దీంతో పశువుల కడుపు శుభ్రపడి కడుపు నొప్పితో పాటు నులి పురుగులు కూడా నివారించబడతాయి. ఈ పద్ధతిలో ఈమె ఎన్నో దూడలకు వైద్యాన్ని చేసింది.



మీకు తెలిసిన 'పల్లెజ్ఞానం' మీవద్ద ఏదైనా ఉంటే మాకు పంపండి. మీ పేరున ఆ జ్ఞానాన్ని ప్రచురిస్తాము. మీవద్ద వున్న జ్ఞానం మీతో అంతరించి పోకుండా పదిమందికి ఉపయోగ పడేలా చూడండి. - ఎడిటర్




# 'ఈకోబాబా' అని పిలువబడే బల్బీర్‌సింగ్ సీచేవాల్ పద్మశ్రీ గ్రహీత కథ


సృష్టి సమ్మాన్ - 2009


పద్మశ్రీ పురస్కారం - 2017

"ఈకో బాబా" గా పిలువబడే 'బల్బీర్‌సింగ్ సిచేవాల్" 1962 ఫిబ్రవరి, 2న నిర్మలా సిక్కు కులంలో జన్మించి పంజాబ్ రాష్ట్రంలోని నదులను కలుషితం కాకుండా కాపాడే ఉద్య నాయకుడిగా ప్రసిద్ధి చెందారు. సిక్కుల మత గ్రంథమైన 'గురుబానీ'లోని స్వంత కాళ్ళపై నిలబడాలనే తత్వాన్ని అనుసరించి తాను, తనలాంటి అనేక మంది సహాయంతో నదుల ప్రక్షాళన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. వీరికి ప్రత్యేకించి 180 కి.మీ. పొడవున్న బియాన్ నదికి ఉపనదియైన 'కాళీబెన్'ను శుభ్రం చేసినందుకు గాను భారత ప్రభుత్వం 2017లో 'పద్మశ్రీ' పురస్కారంతో సత్కరించింది.

2009లో పంజాబు హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా అక్కడి పంజాబు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇతర పరిసర గ్రామాల వారు ఎవ్వరూ కూడా ధోబ ప్రాంతంలో బియాన్ నదికి ఉపనదిగా వున్న కాళీబెన్‌ని పరిశుభ్రం చేయటానికి పూనుకోకపోతే ఈయనే స్వయంగా 180 కి.మీ. నదిని శుద్ధి చేసే ప్రక్రియను ఒక ఉద్యమంగా స్థానికుల సహాయంతో ప్రారంభించారు. చాలా కష్టమైన పని అయినప్పటికీ క్రమంగా స్థానికులు, ఆ ప్రాంత ప్రజలు దాని యొక్క ప్రాముఖ్యత గ్రహించి, చేయి చేయి కలిపి ఈ పనిని పూర్తి చేశారు. దానికి బల్బీర్‌సింగ్ సిచెవాల్ గారు నేతృత్వం వహించారు. సిచెవాల్ సేవలను గుర్తించిన 'హనీబీ నెట్‌వర్క్' వీరిని 'సృష్టి సమ్మాన్' పురస్కారంతో 2009లో సత్కరించింది.

కొన్ని ప్రాంతాల్లో నది ఎండిపోయి, చెత్త చెదారంతో నిండిపోయి చారిత్రాత్మకంగా, ఆధ్యాత్మికంగా కూడా తన ఉనికిని కోల్పోయిన పరిస్థితుల్లో ఈయన ఆ బృహత్కర కార్యక్రమాన్ని చేపట్టడంతో దానికి ప్రాముఖ్యత పెరిగింది.

సట్లెజ్ మరియు బియస్ నదులకి ఉపనదిగా వున్న ఈ కాళీబెన్ ఉప నదిని ప్రక్షాళన చెయ్యటం తో పాటు, వీరు రెండు తీరాలలో చక్కని పచ్చిక బయళ్ళు, ఉద్యాన వనాలు కూడా ఏర్పాటు చేసి, పర్యాటక స్థలాలుగా నిలిపారు. అందుకు గాను ఈయనని "ఈకో బాబా" అని పిలవడం ప్రారంభించారు అక్కడి ప్రజలు. ఈ పని చేపట్టడంలో ఆయన ప్రభుత్వ వద్ద నుండి ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. కేవలం తను, తనతో స్వచ్ఛందంగా వచ్చిన కొందరు వ్యక్తుల సహాయంతో ఈయన చేసిన పనికి అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. 'టైమ్స్' పత్రిక పర్యావరణానికి పాటు పడిన 30 మంది ప్రముఖులలో వీరి పేరును ప్రస్తావించి గౌరవించింది. అబ్దుల్ కలామ్ గారు వీరిని రెండుసార్లు కలిసి తన అభినందనలు తెలియజేశారు. సిక్కుల ప్రథమ గురువైన గురునానక్ మహరాజ్ గారు ఈ నది ఒడ్డున జ్ఞానోదయం పొందారని తెలుసుకున్న సిచెవాల్, 2000 సంవత్సరం







లోనే వాటిని శుద్ధి చేసే పనిని ప్రారంభించారు. ఈ శుభ్రపరిచే కార్యక్రమం జరుగుతూ ఉండగానే ఆ చుట్టు ప్రక్కల ప్రాంత ప్రజలు, పరిశ్రమలు తమ వ్యర్థాలను ఈ ఉపనదిలోకి వదలటంతో ఆ నీరు యింకా మురికి అయిపోయింది. దాంతో ఈయన భూగర్భంలో డ్రయినేజి నీరు పోయేలా ఏర్పాటు చేసి ఆ మురికి నీటిని శుభ్రం చేసిన తరువాత నదిలోకి విడిచిపెట్టే ఉద్యమాన్ని ప్రారంభించారు. క్రమంగా యిది గురునానాక్ గారికి సంబందించిన పుణ్య కార్యం అని గ్రహించి చుట్టు ప్రక్కల 50 గ్రామాలు, పట్టణ వాసులు, కర్మాగారాల యజమానులు కూడా తమ వ్యర్థాలు శుద్ధి చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాళీబెన్ నది శుభ్ర పరచడమే కాక, పంజాబ్ కపుర్తల ప్రాంతం ఎడారిలా తయారు కాకుండా కాపాడబడింది.

ఈయన సామాజిక సేవ కేవలం నదులని శుభ్రపరచటంతోనే ఆగిపోలేదు. ఎన్నో పాఠశాలలు, కళాశాలలు కూడా ప్రారంభించి, పేద విద్యార్థులను ఉచితంగా చదివించారు. ఈయన సిచెవాల్, తల్వాండి, సుల్తాన్‌పూర్, లోడి మొదలైన ప్రాంతాల్లో అనేక చెట్లు నాటించి, ఆ ప్రాంతం యువతకి ప్రతి సంవత్సరం ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చి ప్రోత్సహించేవారు.

ఈయన ప్రపంచ వ్యాప్తంగా కరసేవకులను సమకూర్చి స్వచ్ఛందంగా అనేక ప్రజోపకార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పవిత్ర కాళీబెన్ నది శుద్ధి చేయుటంతో ఈయున చేసిన పద్ధతిలో పంజాబు ప్రభుత్వం ఇప్పుడు అనేక కార్యక్రమాలు చేపట్టి నదులను శుభ్రం చేసే పని ప్రారంభించింది. పంజాబ్‌లో ఈయనని సంత్ బల్‌బీర్ అని ఒక సాధువుగా గురు భావంతో చూస్తారు. అబ్దుల్ కలామ్ గారు తాను ఎక్కడ మాట్లాడినా ఈ బల్‌బీర్‌సింగ్ గారు చేసే ఘన కార్యాల గురించి ప్రస్తావించేవారట.

ఈయన తన 'సంగర్' సంస్థలోని వ్యక్తులతో కలిసి జలంధర్ ప్రాంతంలోని కాలా నంఘియా నదిని కూడా ప్రక్షాళన చేసే కారక్రమాన్ని ప్రజా ఉద్యమంలా చేపట్టారు. నదుల ప్రక్షాళన చెయ్యటం, పాద యాత్రలు చేస్తుండటంతో 'పాద యాత్రల సంత్' అని కూడా పిలువసాగారు ప్రజలు. ప్రతిదీ ఒక ఉద్యమంలా చేపట్టిన ఈయన నిరక్షరాస్యత, మూఢ నమ్మకాలు, పేదరికం, ప్రజలపై జరిగే అత్యాచారాలపై పోరాడుతూనే పాఠశాలలు, కళాశాలలు నిర్మిస్తూ, చదువులకి ప్రత్యేకించి ఆడ పిల్లలకి సాధారణ విద్య, సాంకేతిక విద్య అందించటానికి ఎంతో పాటు పడ్డారు.

యువత మత్తు పదార్థాలు, త్రాగుడు వ్యసనాల నుంచి బైట పడాలనే ఉద్దేశ్యంతో వారికి ప్రత్యేకంగా ఆటలు, పాటలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించేవారు. ఏ పంజాబ్ పొల్యూషన్ బోర్డ్ సక్రమంగా పని చేయటం లేదు అని తాను ఉద్యమించాడో, యిప్పుడు అదే బోర్డులోనే సభ్యునిగా ఉంటూ పర్యావరణ రక్షణకి పాటు పడుతున్నారు. ప్రజలకి మంచి వార్తలు, కార్యక్రమాల గురించి తెలియ చెప్పటానికి కూడా తాను పుట్టిన ఊరు సీచేవాల్ లో 'అవతార్ ఎప్‌ఎం 90.4 రేడియో'ని ఏర్పాటు చేశారు. అనేకసార్లు వరదలు వచ్చినప్పుడు సహాయ కార్యక్రమాలు చేపట్టారు.

ఎన్నో దేశ, విదేశ, రాష్ట్ర, అంతర్జాతీయ సంస్థలు ఈయనని బిరుదులతో సన్మానించి, సత్కరించాయి. కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా పార్లమెంట్లు ఈయనని ప్రత్యేకంగా గౌరవించాయి. 'సార్క్'దేశాలు ఎన్విరాన్‌మెంటర్ అవార్డ్ ఇచ్చాయి. ధర్మస్థల, దలైలామా గారు కూడా ఇతన్ని సత్కరించారు. పంజాబు విశ్వ విద్యాలయం, ఇంకా అనేక విశ్వ విద్యాలయాలు ఈయనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చాయి. ఆమ్ ఆద్మీ పార్టీ వీరిని ప్రస్తుతం 'రాజ్య సభ్యత్వం' ఇచ్చి గౌరవించింది.







## రోడ్డు సౌకర్యం లేని మారుమూల గ్రామాలకు ఓ వరం

# శ్రమను తగ్గించే 'డోలీ అంబులెన్స్'

### సీరియల్ ఇన్నోవేటర్ 'రేపల్లె షణ్ముఖరావు' సృజనాత్మకత

- వీరరాఘవ రెడ్డి

అడవులలో నివసించే గిరిజన ప్రాంత ప్రజలు అనారోగ్యానికి గురైనపుడు, గర్భిణీ స్త్రీల ప్రసవ సమస్యలు ఎదురైతే వారిని సమీపం లోని ఆసుపత్రికి చేర్చాల్సి వస్తే వారు పడే బాధలను మనం నిత్యం వార్తల్లో చూస్తూనే ఉన్నాం. అడవుల్లో నివసించే వారికి రహదారులు లేక, కొండలు, గుట్టలు, కోనలు దాటుకుంటూ 'డోలీ'లలో రోగులను చేరవేసే పరిస్థితులను గురించి తెలియని వారుండరు.

ఈ సమస్య మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు, వైద్య సౌకర్యం లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ, అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీ స్త్రీలను అడవుల నుండి సరైన రహదారిలేని పరిస్థితుల్లో ఒక కర్రకు డోలీ కట్టి, అందులో గర్భిణీ స్త్రీలను, రోగులను కూర్చోబెట్టుకుని ఇద్దరు మనుషులు తమ భుజాలపై మోస్తూ కొన్ని కిలోమీటర్ల దూరం అడవి మార్గం గుండా ప్రయాణిస్తే కాని ప్రధాన రహదారిని లేదా



ఆసుపత్రిని చేరుకోలేరు. అన్ని కిలోమీటర్ల దూరాన్ని ఇద్దరు వ్యక్తులు 70-90 కిలోల బరువుగల మనిషితో కూడిన డోలీని భుజాలపై మోయడం చాలా కష్టతరమైన పని. ఆ బరువుని మోసే కష్టాన్ని కొంత వరకైనా తగ్గించే ఉపాయం ఆలోచించాడు మహబూబాబాద్ జిల్లా కేంబాల పల్లె గ్రామవాసియైన మన సీరియల్ ఇన్నోవేటర్ 50 సంవత్సరాల 'రేపల్లె షణ్ముఖ రావు'.

అడవులలో కేవలం కాలిబాట మాత్రమే ఉంటుంది. ఒక్కో చోట కనీసం మోటారు సైకిల్ పైన ప్రయాణం చేయటం కూడా కష్టమే. ఎందుకంటే దారి మొత్తం రాళ్ళు, కాలువలు, వాగులు, ఎత్తు పల్లాలు.... ఇలా అనేక రకాల పరిస్థితులను అధిగమిస్తూ బరువైన డోలీ మోయాలి. ఆ పరిస్తితులకు అనుగుణంగా వారు మోసే ఆ భారాన్ని, వారు పడే కష్టాన్ని, ఇబ్బందిని దాదాపు 80 శాతం వరకు తగ్గించ గలిగే ఉపాయం ఆలోచించాడు షణ్ముఖరావు.

సాధారణంగా గిరిజనులు వాడే డోలీకి పెద్దగా మార్పు చేర్పులు లేకుండా డోలీకి వుండే కర్ర స్థానంలో ఒక తేలికపాటి ఇనుప పైపు తీసుకుని దాని ఎత్తును డోలీ మోయాల్సిన వ్యక్తులకు అనుకూలంగా మార్చుకునే విధంగా రెండు నిలువు పైపులను, వాటికి సైకిల్ చక్రాలను బిగించాడు. ఆ పైపు కూడా చేతి పట్టు జారకుండా ఉండేలా పటుత్వం ఉండేలాగా సపోర్టు పైపులు బిగించాడు. పైపుకు మధ్యలో డోలి కట్టి, రోగిని అందులో కూర్చోబెట్టుకుని, మోసే మనుషులపై భారం పడకుండా చక్రాల ద్వారా నాట్టెకుంటూ వెళ్తారు డోలీ మోసే వ్యక్తులు. దారిలో డోలీని తోయాల్సిన పరిస్థితులు లేనపుడు వారు దానికి ఏర్పాటు చేసిన చక్రాలను పైకి వచ్చేలా అమర్చుకుని డోలీని తమ భుజాలపై మోసుకుంటూ తీసుకు వెళ్తారు. మళ్ళీ దారి కాస్త

(28వ పేజీ చూడండి)



# చెట్లను ఎక్కే బైకు తయారు చేసిన కర్ణాటక రైతు గణపతి భట్

- జమ్మలమడక శశిమోహన్

కర్ణాటక రాష్ట్రంలోని బంత్వాల్ తాలూకా, పానోలి బైల్ ప్రాంతంలో గల కొమాలి గ్రామంలో 'గణపతి భట్' అనే రైతు నివసించేవాడు. అతడు కేవలం రైతే కాక ఒక ఇన్నోవేటర్ కూడా. ఇతను చెట్లు ఎక్కే బైకులా ఉండే పరికరం కనుగొన్నాడు. ఈ వాహనంతో ఎవరైనా సరే మోటార్ సైకిల్‌లా చెట్లు ఎక్కవచ్చు. సునాయాసంగా దిగవచ్చు. దానిని కనిపెట్టడానికి అసలు ముఖ్య కారణం గణపతి నివసించే ప్రాంతంలో చెట్లు ఎక్కే వారి కొరత చాలా ఉండటం.

ఈయన కదిరి లోని తన ఇంటి పెరడులో, మేర్లపాడు లోని తన పొలంలో కూడా చాలా పెద్ద సంఖ్యలో కొబ్బరి, వక్క చెట్లు నాటాడు. పొడుగ్గా పెరిగిన ఈ వక్క, కొబ్బరి రకం చెట్లపైకి ఎక్కే వారిని వెతికి పట్టుకోవటం చాలా కష్టం అయిపోయింది గణపతికి. ఒకవేళ దొరికినా వారు చాలా పెద్ద మొత్తంలో కూలీ అడగసాగారు. ఈ కాలం యువత ఈ రకం చెట్లు ఎక్కటంలో నేర్పు సంపాదించాలనే ఉత్సాహం చూపించటం లేదు. ప్రస్తుతం చెట్లు ఎక్క గల వారు మధ్య వయస్కులు, వృద్ధులు అయిపోతున్నారు. భవిష్యత్తులో చెట్లు ఎక్కే సమస్య యింకా జటిలం అయిపోతుందని గ్రహించిన గణపతి భట్ దీనికో పరిష్కారం కనుగొనాలి అనుకున్నాడు.



ఈ పరికరం ఉపయోగించి, చెట్లపైన పురుగు మందులు కూడా చల్లుకోవచ్చు. అదేవిధంగా అవసరం లేని కొమ్మలు, ఆకులని కూడా తొలగించవచ్చు. దీనిని ఆతను భారత దేశంలోని అనేక రాష్ట్రాల వారికే కాక, సింగపూర్, మలేషియా లాంటి దేశాలకు కూడా ఎగుమతి చేశాడు.

ఈ పరికరంలో 3 స్ట్రోక్ ఇంజన్ ఉండి, ఒక సీటు, సేఫ్టీ బెల్ట్, గేర్లు, డబల్ చైను, హైడ్రాలిక్ డ్రమ్ బ్రేకులు కలిగివుండి 28 కిలోల బరువు ఉంటుంది. ఎవరైనా సరే 80 కిలోల బరువు వరకు వున్న వ్యక్తి ఈ మోటార్ సైకిల్ సీటుపైన కూర్చుని సేఫ్టీ బెల్ట్ తగిలించుకొని మీట నొక్కితే 30 సెకండ్లలో చెట్టుపైకి ఎక్కెయ్య వచ్చు. పడిపోతామన్న సంశయం కానీ, చెట్టు దెబ్బతింటుదన్న భయం కానీ అవసరం లేదు. చెట్టు దిగేటప్పుడు కూడా అంతే. దిగిన తర్వాత మీట ఆపేసి, బెల్టు తీసేసి బైటకి రావచ్చు. దీనికి హైడ్రాలిక్ బ్రేకులు అమర్చబడ్డాయి. స్కూటరుకి ఉన్నట్లే దానికి బ్రేకు హాండిల్ ఉంటుంది. దీనికి ఇంధనం ఆయిల్ లెవెల్ చూపించే పరికరం కూడా అమర్చబడింది. భట్ ఈ పరికరం గురించి వివరిస్తూ దీనికి హైడ్రాలిక్ బ్రేక్ బిగించి ఉండటం వలన ప్రమాద వశాత్తు చెట్టు పైనుంచి పడిపోయినా చనిపోయే ప్రమాదం లేదు అంటాడు. కేవలం చిన్న దెబ్బలు తాకుతాయే తప్ప ప్రాణం పోయేంత ప్రమాదం ఉండదు.

ఈ పరికరం పెట్రోలు ఆధారంగా నడుస్తుంది. దీనిని నడిపే వ్యక్తి 50 నుంచి 60 కిలోల బరువు ఉంటే, ఒక లీటరు పెట్రోలుకి

దాదాపు 80 చెట్లు ఎక్కి దిగవచ్చు. ఇదే పనిని కూలీలతో చేయించాలంటే ఒక్కొక్కరికి రోజుకి 2000 రూపాయలు యివ్వాల్సి వస్తుంది. ఆదీ అతను కేవలం 25 నుండి 30 చెట్లు ఎక్కి కాయలు కోయటం కానీ, మందులు చల్లటం కానీ చెయ్యగలడు. కనుక ఈ పరికరం వాడటం వలన పనితనం పెరగటమే కాక ఖర్చులు కూడా తగ్గుతాయి. మనుషుల అవసరం తగ్గించి కాయలు కోయటం, పురుగు మందులు చల్లుకోవటానికి ఈ యంత్రం ఎంతో సహాయకారిగా ఉంటుంది. ఈ యంత్రం ఖరీదు రూ. 75 వేల వరకు అవుతుంది.







భట్ చెప్పిన దానిప్రకారం ఆడ, మగ, చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఎవరైనా ఈ యంత్రం వాడి చెట్టు ఎక్కి కావలసిన పని చేసుకోవచ్చు. దీనిని నడవటానికి ఏవిధమైన ప్రత్యేక శిక్షణ తీసుకోవాల్సిన అవసరం లేదు. కొంచెం అలవాటు పడితే చాలు. యంత్రంలో కొద్ది మార్పులు చేసి కొబ్బరి చెట్లు కూడా ఎక్కవచ్చు. వక్క (పోక చెక్క) చెట్లు ఉన్నవారు వాటి కొమ్మలు, పనికిరాని ఆకులు కత్తిరించటం, కాయలు కోయటం, పురుగు మందు చల్లటం రైతులకి ఎంతో ఉపయోగకరంగా ఉండి చాలావరకు ఖర్చులు, శ్రమ తగ్గిస్తుంది ఈ యంత్రం. ఎంతోమంది వక్క, కొబ్బరి పండించే రైతుల మన్ననలు పొంది, వారికి ఎంతో ఖర్చు, శ్రమ మిగిలేలా చేస్తోంది యంత్రం. ●

## శ్రమను తగ్గించే 'డోలీ ఆంబులెన్స్'

(26వ పేజీ తరువాత)

చక్రాలు కదల గలిగే పరిస్థితి వచ్చినపుడు మళ్ళీ చక్రాలను క్రిందకు దించి డోలీను తోసుకుంటూ తీసుకు వెళ్తారు. చక్రాలను పైకి క్రిందకు జరిపినపుడు మళ్ళీ అవి కదలకుండా ఎక్కడ ఏర్పాటు చేస్తే అక్కడే ఉండేలా అవి లాక్ అయ్యేలా ఏర్పాటు కూడా చేశాడు కాబట్టి చక్రాలు మోసేటపుడు కానీ, తోసుకుంటూ వెళ్ళేటపుడు కాని డోలీ మోసే వ్యక్తులను ఎటువంటి ఇబ్బందిని కలిగించవు.

డోలీ లోని రోగికి మరియు డోలీ మోసే వ్యక్తులకు ఎండా వానల నుండి ఆచ్ఛాదన కలిగేలా ఈ డోలీకి గొడుగులను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. అంటే వాతావరణ పరిస్థితి ఏదైనా రోగిని ఆసుపత్రికి చేర్చవచ్చు అన్నమాట. అంతే కాదు ఒకవేళ రాత్రి వేళల్లో డోలీ తీసుకు వెళ్ళాల్సిన పరిస్థితులు ఏర్పడితే కూడా దారి కనపడటానికి వీలుగా ఇదే డోలీకి సోలార్ సహాయంతో పనిచేసేలా ఒక లైటును కూడా ఏర్పాటు చేశాడు. పైగా దారిలో రోగికి ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే కూడా అవసరమైన 'ఫస్ట్ ఎయిడ్' కిట్‌ను భద్రపరచుకునేందుకు ఒక



అరను కూడా ఏర్పాటు చేశాడు. డోలీకి ఏర్పాటు చేసిన పైపు 10 అడుగుల పొడవు, 2 అంగుళాల వ్యాసంలో ఉంటుంది కాబట్టి అవసరమనుకుంటే ఆ పైపులో ఆక్సిజన్ నింపుకున్నట్లయితే అత్యవసర పరిస్థితుల్లో పేషెంటుకు ఆక్సిజన్ కూడా అందించవచ్చు.

వార్తా పత్రికలు, టీవీలలో ఇలాంటి సంఘటను చూసే వ్యక్తులు ఇటువంటి గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయలేక పోతున్నారని ప్రభుత్వాలను ఆడిపోసుకుంటారు. అలాంటి మార్గాల్లో రోడ్లు వేయటానికి వారి సాధక బాధకాలు ఏముంటాయో తెలియదు. కానీ సమస్యను చూసి ఇతరులపై నిందలు మోపకుండా ఒక సులువైన పరిష్కారం ఆలోచించాడు షణ్ముఖరావు. ఇటువంటి డోలీలను ప్రతి మారుమూల (రిమోట్) గ్రామాలలో ప్రభుత్వాలు లేదా స్వచ్ఛంద సంస్థలు లేదా విశాల హృదయులు ఒకటి రెండు ఏర్పాటు చేయ గలిగితే సమస్యను కొంత వరకైనా తీర్చిన వారవుతారు.

ఒక ఇన్నోవేషన్ తయారు చేసిన తర్వాత ఇంతేనా అనుకోవటం లేదా ఇదేదో బావుందే అనుకోవటం సర్వ సాధారణం. కానీ, సమస్యను గుర్తించి వాటిని పరిష్కారం సులువైన మార్గంలో ఆలోచించ గలిగిన వాడే ఇన్నోవేటర్. అటువంటి ఇన్నోవేటర్లను వెలుగులోకి తీసుకు రావటమే 'పల్లెసృజన' చేస్తున్న బృహత్తర కార్యక్రమం. ఇప్పుడైనా షణ్ముఖరావు చేసిన డోలీని ప్రతి మారుమూల గిరిజన గ్రామాలకు చేర్చ గలిగితే ఈ వ్యాసానికి పరిపూర్ణత చేకూరినట్లే. 'డోలీ ఆంబులెన్స్' ఇన్నోవేషన్ చేసిన రేవల్లె షణ్ముఖరావును అభినందిస్తోంది 'పల్లెసృజన'.

**ఇన్నోవేటర్ షణ్ముఖరావు, ఫోన్ : 9492113609**

**మరిన్ని వివరాలకు సంప్రదించండి :**

**సుభాష్ చందర్, ఫోన్ : 9652801700**

●

# ఆయుర్వేద జ్ఞాన మధనం

## ఔషధ మొక్కలు - వాటి ఉపయోగాలు


ఉమా మహేశ్వర రావు

**తల్లితో సమానమైన 'ఉల్లి' తో ఆరోగ్య సమస్యల నివారణ:**

'ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదు' అని ఓ సామెత పూర్వం నుండి ప్రాచుర్యంలో ఉంది. ప్రతిరోజూ ఒక ఉల్లిపాయ తిన్నట్లయితే చాలా వరకు డాక్టరు అవసరం ఉండదు. ఎందుకంటే ఇందులో అల్యూమినియం పోషకాలు ఎక్కువగా ఉంటాయి. అల్యూమినియం శరీరానికి చాలా అవసరం. అలాగే ఇందులో గంధకం, 'ఎ' మరియు 'సి' విటమిన్‌లు , ఇనుము, సున్నము, రాయి లాంటి శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు కూడా సమృద్ధిగా ఉన్నాయి.

ఉల్లిని రోజూ తినటం వల్ల దగ్గు, జలుబు, మలబద్ధకం, మూత్ర పిండాలకు సబంధించిన సమస్యలుర ఏవీ దరిచేరకుండా ఉంటాయి. ఉల్లికి చలువ చేసే గుణం పుష్కలంగా ఉంది. పురుషులలో శుక్ర వృద్ధి జరిగి సంతాన లేమి సమస్య కూడా పరిష్కరించ బడుతుంది. హృదయ రోగాలను కూడా చాలా వరకు నివారిస్తుంది. గుండెకు రక్తాన్ని చేర్చే నాళాలు మూసుకు పోకుండా చేస్తుంది. రాత్రి పూట ఉల్లి తింటే నిద్ర కూడా బాగా పడుతుంది.

ఉల్లిపాయల్లో తెల్లవి, ఎర్రవి అని రెండు రకాలు ఉన్నాయి. కొందరు పురుషులకు వీర్య నష్టం జరుగుతూ ఉంటుంది. మూత్రం లో వీర్యం పోతూ ఉంటుందని డాక్టర్ల వద్దకు వెళుతూ ఉంటారు. అటువంటి వారు తెల్ల ఉల్లిపాయను ముక్కలుగా చేసి, కొద్దిగా నూనెలో వేయించి, అందులో కొద్దిగా చక్కెర లేదా బెల్లం కలుపుకుని తిన్నట్లయితే ఈ సమస్య నుండి పరిష్కారం పొందవచ్చు.

కొందరికి చిగుళ్ళలో నుంచి రక్తం కారుతూ ఉంటుంది. అటువంటి వారి నోరు దుర్వాసన కూడా ఉంటుంది. ఈ సమస్య పరిష్కారానికి ఉల్లిపాయను రసం చేసుకుని అందులో పటిక బెల్లం పంచదార లేదా సైంధవ లవణం లలో ఏదో ఒకటి అందుబాటులో ఉన్నది వేసుకుని రోజూ పళ్ళు తోముకున్నట్లయితే చిగుళ్ళ నుంచి రక్తం కారటం, నోటి దుర్వాసన, పంటి నొప్పి సమస్యల నుండి విముక్తి పొందవచ్చు. పళ్ళు తోమేటపుడు వేలితో చిగుళ్ళను బాగా మర్దనా చేసినట్లు తోముకుంటే ఈ సమస్య ఇంకా త్వరగా నయమౌతుంది.

కొంతమంది పళ్ళల్లో ఎనామిల్ పోయిందని పళ్ళకు క్యాప్‌లు వేయించుకుంటూ అంటారు. అటువంటి వారు ఉల్లి విత్తనాలను మెత్తగా దంచి, ఆ పిండితో పళ్ళను శుభ్రంగా తోముకున్నట్లయితే పళ్ళల్లో ఎనామిల్ బాగా పెరగటమే కాక, పండ్ల సందుల్లో ఇరుక్కున్న ఆహారం కూడా బయటకు వచ్చి చాలా వరకు పంటి సమస్యల నుండి విముక్తి కలిగిస్తుంది.

కంటికి సబంధించిన ఎటువంటి సమస్యలు ఉన్నవాళ్ళయినా ఉల్లిపాయను ముక్కలుగా చేసి, మెత్తగా దంచి, రసం తీసి ఆ రసాన్ని కంటికి కాటుకలాగా అప్పుడప్పుడూ పెట్టుకుంటూ ఉన్నట్లయితే కంటికి సబంధించిన సమస్యల నుండి పరిష్కారం కలుగుతుంది.

చుట్ట, బీడి సిగరెట్ లాంటి ధూమపానం అలవాటు ఉన్న వారికి నికోటిన్ వల్ల ఆరోగ్యానికి చాలా సమస్యలు వస్తూ ఉంటాయి. గొంతులోకి వెళ్ళిన నికోటిన్‌ను తొలగించే శక్తి ఈ ప్రపంచంలో రెండింటికి మాత్రమే ఉంది. అవి ఉల్లి, తులసి ఆకులు. ధూమపానం అలవాటు ఉన్నవారు ఉల్లిని ముక్కలుగా తరిగి, బెల్లంతో కలిపి తీసుకున్నట్లయితే శరీరంలోకి వెళ్ళిన నికోటిన్ చాలా వరకు తీసివేయ బడుతుంది. ఈ బెల్లం ఉల్లిపాయ తింటే ఎదుగుదల సరిగ్గా లేని పిల్లలలో కూడా ఎదుగుదల చాలా బాగా ఉంటుంది.

కొందరికి ముక్కు బెదిరి రక్తం కారుతూ ఉంటుంది. అటువంటి వారు ఉల్లిపాయను ముక్కలుగా చేసి దాని వాసన చూసినా, లేదా ఉల్లి రసం తీసి, ముక్కులో ఒకటి రెండు చుక్కలు వేసుకున్నా రక్తం కారటం సమస్య నుండి పరిష్కారం లభిస్తుంది.

కొంత మందికి శరీరంపైన గడ్డలు అవుతూ ఉంటాయి. అటువంటి వారు ఉల్లిపాయను బాగా నిప్పులపై ఉడికించి, ఆ ఉల్లిపాయను శరీరంపైన ఉన్న గడ్డపైన వేసి కట్టు కట్టినట్లయితే ఆ గడ్డలు లోపలే కరిగి పోవటం లేదా, పగిలి బయటకు రావటం జరుగుతుంది.

ఉల్లిపాయ రసం తీసి అందులో పటిక బెల్లం, కలకండ లేదా చక్కెర వేసుని సేవించినట్లయితే రక్తపు మొలలు వ్యాధితో బాధ పడతున్న వారికి చాలా త్వరగా ఉపశమనం కలుగుతుంది. మొలలు నివారించ బడతాయి.

ఉల్లిపాయను చక్రాల్లాగా తరిగి, వాటికి బెల్లం కలిపి కొద్దిసేపు మంచులో (ఐస్ గడ్డల్లో లేదా డీఫ్రిజ్‌లో) ఉంచి ఉదయం పరగడుపున ఆ ముక్కలను రసం చేసి, ఆ రాన్ని తీసుకున్నట్లయితే ఎంతో కాలంగా, ఎన్ని మందులు వాడినా తగ్గక బాధ పెడుతున్న కోరింత దగ్గు నయమౌతుంది.

రాత్రుళ్ళు నిద్ర పట్టక, అజీర్తి వల్ల బాధ పడుతున్న వారు రాత్రి పూట ఉల్లిపాయ కూర చేసుకుని తిన్నట్లయితే ఈ సమస్యల నుండి బయట పడవచ్చు. నిద్ర బాగా పడుతుంది, అజీర్తి నుండి కూడా విముక్తి లభిస్తుంది.

**కాళ్ళ పిక్కల నొప్పితో బాధ పడే వారికి ఆవు పాలతో విముక్తి:**

కొంతమంది కొద్దిసేపు నడిచినా, ఎక్కువ సేపు నిలబడినా కాళ్ళ పిక్కలు లాగినట్లయి, విపరీతమైన నొప్పితో బాధ పడుతూ ఉంటారు. అటువంటి వారు పచ్చి ఆవు పాలలో కొద్దిగా వేడి నీటిని కలుపుకుని ప్రతిరోజూ సాయంత్రం క్రమం తప్పకుండా

**గమనిక:** ఈ శీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

**'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 94402 86854**

### అజీర్తి సమస్యలకు ఆయుర్వేద చిట్కాలు :

అరటికాయను చిన్న చిన్న ముక్కలుగా తరిగి, బాగా ఎండబెట్టి రోట్లో వేసి మెత్తని పొడిగా చేసుకుని ఒక డబ్బాలో వేసి ఉంచుకోవాలి. ప్రతిరోజు ఒక్క పూట భోజనానికి ముందు, తర్వాత ఒక స్పూను పొడిలో కొద్దిగా సైంధవ లవణం కలుపుకుని నోట్లో వేసుకుంటూ ఉంటే అజీర్తి సమస్యలు తీరిపోతాయి, తిన్న భోజనం త్వరగా అరిగి, ఆకలి బాగా అవుతుంది.

చెంచలాకు, తూటాకు, తుమ్మి ఆకు, నీరుగొబ్బి ఆకు, ముళ్ళ తోటకూరాకు, చిలకముక్కు ఆకు వీటిలో ఏదైనా సరే ఆకులను తీసుకుని, వేపుడుగా కాకుండా, పులుసు కూరగా చేసుకుని తిన్నట్లయితే కూడా జీర్ణ శక్తి బాగా పెరుగుతుంది. ఆకలి బాగా వేస్తుంది, ఆరోగ్యానికి మంచిది.

### చెవిపోటు, చెవి నొప్పి, చెముడు సమస్యలకు చిట్కాలు:

పొలాల్లో లభించే ఒక బంతిలాగా ఉండే 'చేదు పుచ్చకాయ' (తిక్క పుచ్చకాయ) చెట్టు వేరు తీసుకుని, శుభ్రంగా నీటితో కడిగి, రోట్లో వేసి మెత్తగా దంచి రసం తీయాలి. అలా తీసిన రసాన్ని చెవిలో 3–4 చుక్కలను మూడు లేదా నాలుగు రోజుల పాటు వేసుకున్నట్లయితే చెవికి సంబంధ సమస్యలన్ని నయమౌతాయి.

### ముక్కులో నీరు కారటం, ముక్కు దిబ్బడ, తలనొప్పి, పార్శ్వపు తలనొప్పి సమస్యలకు పరిష్కారం:

కొందరికి ముక్కునుండి అదేపనిగా నీరు కారుతూ ఉంటుంది. ఈ సమస్య వల్ల కొందరిలో తలనొప్పి, మరి కొందరిలో పార్శ్వపు తలనొప్పి వచ్చి చాలా ఇబ్బంది పడుతుంటారు. అటువంటి వారు 'పిప్పెంటాకు'లను సేకరించి, రోట్లో వేసి మెత్తగా దంచి, వాటి రసాన్ని ముక్కలో 3-4 చుక్కలను రెండు మూడు రోజులు వేసుకున్నట్లయితే ముక్కులో నీరు కారటం, తలనొప్పి, పార్శ్వపు తలనొప్పి, ముక్కు దిబ్బడ లాంటి సమస్యలన్నీ నయమౌతాయి.

### వేసవిలో వచ్చే విరోచనాలను అరికట్టేందుకు ఆయుర్వేద పరిష్కారం:

వేసవి కాలంలో కొందరికి నీళ్ళ విరోచనాలు, రక్తపు, బంక విరోచనాలు తరచుగా వస్తూ వుంటాయి. ఈ విరోచనాల వల్ల కడుపులో నొప్పి కూడా వస్తూ ఉంటుంది. అందువల్ల మనిషి త్వరగా అలసి పోయి, ఏ పని చేయటానికి కూడా మనసొప్పక, నీరసించి పోతూ ఉంటారు. ఈ సమస్యలకి పరిష్కారంగా ఒక గ్లాసు వేడి నీళ్ళు తీసుకుని, అందులో స్వచ్ఛమైన ఆవు నెయ్యి రెండు చెంచాలు వేసుకుని ఆ నీటిని తాగితే విరోచనాలు అన్ని తగ్గిపోతాయి.

### తలలో పేళ్ళ సమస్యకు పరిష్కారం:

కొంతమంది తలలో పేలు విపరీతంగా ఉండటంతో తల గోక్కోలేక చాలా ఇబ్బంది పడుతూ ఉంటారు. ఈ సమస్య నివారణకు ఒక లీటరు నీటిలో 3 గ్రాముల పటిక వేసి నీటిని బాగా కలిపినట్లయితే ఆ పటిక నీటిలో కరిగి పోతుంది. ఆ నీటిని తలకు బాగా పట్టించి, కొద్దిసేపు ఆగిన తర్వాత తల స్నానం చేసిట్లయితే పేలన్నీ చనిపోయి క్రిందకు రాలిపోతాయి. ఇలా ఒక వారం పాటు చేసుకున్నట్లయితే తలలోని పేల సమస్యకు చక్కగా పరిష్కరించుకోవచ్చు.

### వెంట్రుకలు ఊడిపోయే సమస్యకు పరిష్కారం:

కొందరికి అదేపనిగా వెంట్రుకలు ఊడిపోతూ ఉంటాయి. ఇలా ఊడిపోవటం వల్ల త్వరగా బట్టతల వచ్చే అవకాశం ఎక్కువ. ఈ వ్యాధితో బాధ పడుతున్న వారు ఒక కరక్కాయ తీసుకుని, కాయ సమూలంగా చిన్న ముక్కలుగా చేసి, బాగా ఎండబెట్టి, మెత్తటి పొడిగా తయారు చేసుకోవాలి. లేదా ఆయుర్వేద ఔషధ దుకాణాల్లో కరక్కాయ పొడి నేరుగా లభిస్తుంది. ఈ పొడిని ఒక చెంచాడు తీసుకుని, అందులో ఒక చెంచాడు తేనె కలిపి, వేలితో బాగా కలియబెట్టి నోట్లో వేసుకుని తినాలి. తలకు పూయకూడదు. ఇలా అప్పుడప్పుడూ ఒక రెండు మూడు రోజుల పాటు తీసుకుంటూ ఉన్నట్లయితే తల వెంట్రుకలు రాలటం ఆగిపోతాయి. జుట్టు కూడా ఒత్తుగా పెరుగుతుంది, తెల్ల వెంట్రుకలు కూడా రావు, పైగా తెల్ల వెంట్రుకలు నల్లగా కూడా మారే అవకాశం ఉంటుంది.


- 'వైద్య' కొమెర జాజి

### తలలో చుండ్రు నివారణకు చిట్కా:

తలలో చుండ్రుతో బాధ పడుతున్న వారు కొద్దిగా గసగసాలు తీసుకుని రోట్లో వేసి మెత్తటి పొడిగా చేసి, అందులో కొద్దిగా నీటిని కలిపి మళ్ళీ మెత్తగా నూరితే అది పేస్టులాగా తయారవుతుంది. ఆ పేస్టును తీసుకుని చేతితో లేదా ఒక బట్టలో వేసుకుని మెత్తగా పిండినట్లయితే పాలు లాగా వస్తాయి. ఈ పాలను ఒక గిన్నెలోకి తీసుకుని, అందులో రెండు మూడు చుక్కల నిమ్మరసం కలిపి, తలకు బాగా పట్టించి, ముని వేళ్ళతో జుట్టు కుదుళ్ళకు బాగా పట్టేటట్లుగా చేయాలి. ఆ తర్వాత ఒక అరగంట పాటు అలాగే ఉంచి, గోరువెచ్చటి నీటితో స్నానం చేసినట్లైతే చుండ్రు సమస్యను నివారించుకోవచ్చు. స్నానం చేసేటపుడు తలకు సబ్బు లేదా రసాయనాలతో చేసిన షాంపూ వాడకుండా, కుంకుడు కాయ రసం లేదా హెర్బల్ షాంపూ ఉపయోగించాలి. ఇలా వారంలో రెండుసార్లు చేస్తే చాలు సమస్య నుండి పరిష్కారం పొందవచ్చు.

### ఉబ్బసం, ఆయాసం, దగ్గు సమస్యల నివారణకు చిట్కా:

ఈ వ్యాధులు ఉన్నవారు ఎండా కాలలో ఎక్కువసేపు నడిస్తే ఆయాసంతో రొప్పుతూ ఉంటారు. ఈ సమస్య నివారణకు ఒక చిన్న కప్పులో గోమూత్రం తీసుకుని, అందులో బాగా పండిన 'చక్కెర కేళి' పండు తీసుకుని కోసి, గోమూత్రంలో వేసి బాగా పిసికి కలపాలి. అప్పుడు అది ఒక పేస్టులాగా తయారవుతుంది. ఈ పేస్టుని ఒక వారం రోజుల పాటు రోజూ పరగడు పున తాగినట్లయితే ఉబ్బసం, ఆయాసం, వీటివల్ల వచ్చే దగ్గు లాంటి జబ్బులన్నీ నయమౌతాయి.

### పిప్పి పళ్ళు, పంటి నొప్పి, నోటి దుర్వాసన, చిగుళ్ళ నొప్పి సమస్యలకు నివారణ మార్గం:

చాలా మంది పైన చెప్పిన పంటి సమస్యలతో బాధ పడుతూ ఉంటారు. అటువంటి వారు నేరేడు చెట్టు, మామిడి చెట్టు, నల్లతుమ్మ చెట్టు, మర్రి చెట్టు వీటిలో ఏదో ఒక పుల్లను తీసుకుని ఒక వారం రోజుల పాటు పండ్లు, చగుళ్ళను బాగా తోమినట్లయితే నోటికి సబంధించిన దాదాపు అన్ని రకాల సమస్యలు పరిష్కరించ బడతాయి. ●

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' కొమెర జాజి, ఫోన్ నెం.: 9908411700

**ఆయుర్వేదంలో అత్తిపత్తి మొక్క ఉపయోగాలు:**

అత్తిపత్తి ఇది పొదలు పొదలుగా చౌడు నేలల్లోను, దుబ్బ నేలల్లోను గుంపులు గుంపులుగా పెరుగుతుంది. ఎక్కువగా ఆకులను కలిగి తుమ్మ పూలవలె ఎర్రగా (లేత ఎరుపు) పూలను పూస్తుంది. గుత్తులు గుత్తులుగా కాయలను కాస్తుంది. ఆకును ముట్టుకున్నపుడు ముడుచుకుంటుంది (దీన్నే ఆంగ్లంలో 'టచ్ మి నాట్' అంటారు). ఈ చెట్టు కొద్దిగా తీగ వలె భూమిపై ప్రాకుతుంది. ముళ్ళను కలిగి వుంటుంది. దీనికి కొన్ని ప్రాంతాల్లో కొందరు అత్తిపత్తి అని, లజ్జాలు, సిగ్గాకు, నిద్రగన్ని, అత్తపత్తాకు అని ఇలా వేరు వేరు పేర్లతో పిలుస్తారు. ఏదైనా ఆకును ముట్టుకున్న వెంటనే మొత్తం ఆకులు ముడుచుకొని కొద్ది సేపటి తర్వాత విచ్చుకుంటాయి. ఇది మహిళల తత్వానికి అంటే వారి సున్నిత మనస్తత్వపు లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది మహిళలకు అనేక విధాలుగా ఔషధంగా ఉపయోగ పడుతుంది. సున్నితపు కండరాలను ఉత్తేజం చేయడంలో, శరీరపు లోపలి కండరాలలో కలిగిన గాయాలను మాన్పడంలో, మూసుకు పోయిన సన్నని నరాలను పూర్వపు విధంగా పని చేసేట్లు చేయటంలో బాగా ఉపయోగ పడుతుంది. ఇది భూమిమీద ఉన్న మొక్కలలో మహా అద్భుతమైనది.

అత్తిపత్తి మొక్క నుండి ఆకును ఏరుకుని, దాన్ని స్టీలు పాత్రలో వేసి, ఆకు మునిగే వరకు నువ్వుల నూనె లేదా కొబ్బరి నూనెతో నింపి, పొయ్యిమీద పెట్టి సన్నని మంట వెలిగించాలి. ఆకులోని పచ్చిదనము ఇగురు వరకు మరిగించి, దానిని వేడిగా వున్నపుడే వడపోసుకుని, చల్లారిన తర్వాత దాన్ని ఒక సీసాలో భద్రపరచుకోవాలి. ఈ నూనె ఎన్నో వేధాలుగా వాడుకోవచ్చు.

ఎలర్జీకి, పొట్టపై చారలకి, కండరాలపై కలిగే చారలకి, సిరలు మూసుకుపోయి వెరికోయిన్స్ ఏర్పడిన దానికి మర్దనా చేసేందుకు వాడుకోవచ్చు. మహిళలకి పొట్టపై రుద్దడం వలన కొన్ని రోజుల్లో గర్భాశయపు వ్యాధులు తగ్గి, నెలసరి క్రమ పడుతుంది. ప్రతిరోజు ముక్కులలో రెండు చుక్కలు వేసుకోవడం వలన సైనస్ మరియు ఇతర ముక్కు సమస్యలు తగ్గిపోతాయి. రోజూ 5 మి.లీ. నూనె త్రాగడం వలన అల్సర్, జీర్ణాశయంలో పుండ్లు, కరుపులు తగ్గుతాయి. జీవనాంగాల వద్ద మర్దనా చేయడం వల్ల అక్కడున్న సమస్యలు తొలగిపోతాయి.

అత్తిపత్తి ఆకులు ఏరుకుని నీడన ఎండబెట్టి, పొడిగా చేసి, జల్లించి, నిలువ చేసుకున్న పొడిని అనేక విధాలుగా వాడుకోవచ్చు.









బాల నర్సయ్య, నల్గొండ జిల్లా

ఉదయం, సాయంత్రం రోజూ అర స్పూను చొప్పున ఒక గ్లాసు నీటిలో కలుపుకుని భోజనానికి ముందు త్రాగడం వలన జీర్ణ వ్యవస్థ, రక్త శుద్ధి ఏర్పడి శరీరంలో వున్న గాయాలు తొందరగా మాన్తాయి. మగవారిలో వీర్యవృద్ధి జరిగి, సంతానోత్పత్తి జరగడంలో తోడ్పడుతుంది. ఆడవారిలో గర్భాశయ శుద్ధి జరుగుతుంది.

ఈ వెుుక్క వేర్లను సేకరించి, తైలపాకము చేసుకుని జననేంద్రియ స్థానములలో మర్దనా చేయడం ద్వారా ప్రోస్టేటు వాపులు, అండ వృద్ధి, బీర్జాల వాపు, పొట్ట నాల నొప్పులు తగ్గిపోతాయి. మూత్ర సమస్యలు కూడా తగ్గిపోతాయి. అత్తిపత్తి నుండి నూనెను తయారు చేసుకుని పై విధాలుగా వాడుకోవడమే కాకుండా, వ్యాపారం కూడా చేసుకోవచ్చు. లోపలి గాయాలను తగ్గించడంలో చాలా బాగా పని చేస్తుంది.

అత్తి పత్తితో ఇంకొన్ని మొక్కల ఆకులను కలిపి అద్భుతమైన నూనెలు ఏవిధంగా తయారు చేకోవాలో వచ్చే సంచికలలో తెలుసుకుందాం. పల్లె జ్ఞానాన్ని వెలికి తీసి, పచ్చని ఆకులలో గల ఔషధ విలువలను మీ ముందు ఉంచుతున్న 'పల్లెసృజన'కు జై, ప్రకృతి మాతకు జైజై ..... మళ్ళీ వచ్చే సంచికలో కలుద్దాం. ●





**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' బాల నర్సయ్య, ఫోన్ నెం.:

**గణేశం గారికి,**

నేను ఈమధ్య 'వృక్షాయుర్వేదము' అనే పుస్తకం కొని చదవటం జరిగింది. అందులో 'పల్లెసృజన' పేరున ఒక చిట్కా వ్రాయబడి ఉంది. దాన్ని చూసి నాకు ఎంతో సంతోషం అనిపించింది. మన 'పల్లెసృజన' చిట్కాలు ఇతర పుస్తకాల్లో కూడా ప్రచురించి ప్రచారం చేస్తున్నారు అంటే మీరు అందిస్తున్న జ్ఞానం చాలా మంచిది అనిపించి మీకు తెలియజేయటం కోసం ఈ పుస్తకం, అందులోని వ్యాసం మీకు పంపుతున్నాను.

**– విజయకుమార్ రెడ్డి, కడప.**




**విజయ కుమార్ రెడ్డి గారు,**

వేము ప్రచురించిన జ్ఞానం మరొకరు తమ పుస్తకంలో ప్రచురించడం మాకూ ఆనందమే. తెలియజేసినందుకు కృతజ్ఞతలు

**– బ్రిగేడియర్ గణేశం.**

**బ్రిగేడియర్ గణేశం గారికి,**

'పల్లెసృజన' పది కాలాల పాటు పచ్చగా ఉండాలి, మరింత ముందుకు వెళ్ళాలి అన్న ఉద్దేశ్యంతో నావంతు కనీస బాధ్యతగా మారుమూల గ్రామాలకు, అఖ్కడి విద్యార్థులకు చెప్తున్నాను. పదినుండి వంద వరకు ప్రతి ఒక్కరు పత్రికకు చందాలు కట్టించాలి అని నా ఆశయం. ప్రస్తుతం తొలి అడుగుగా, నేను నా శక్తి కొలది 10 చందాలు కడుతున్నాను. భవిష్యత్తులో మరింత ముందుకు తీసుకు వెళ్తానని హామీ ఇస్తున్నాను. **– కొమెర జాజి, పల్నాడు జిల్లా.**

**జాజి గారు,**

మీ సహృదయతకు వందనములు. మీలాంటి వారి సహృదయ భావం గల వాళ్ళ సహకారం వల్లనే 'పల్లెసృజన' పత్రిక గత 17 సంవత్సరాలుగా నిరంతరాయంగా వెలువరించ గలుగుతున్నాము. మీ భావాలను పల్లెసృజన పాఠకులు అందరూ అర్థం చేసుకుని పత్రికను మరింత మందికి చేరువ చేసేలా ప్రయత్నిస్తారని ఆశిస్తున్నాము. మీ చందా మాకు చేరింది. **– బ్రిగేడియర్ గణేశం.**

## FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA)***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

# ఎలక్ట్రిక్ వీడర్

## ఛార్జింగ్ చెయ్ - కలుపు తీసెయ్



ఇన్నోవేటర్
**అంజయ్య**
జగిత్యాల జిల్లా, తెలంగాణ

రోజురోజుకూ పెరిగి పోతున్న ఇంధనం ధరల నుండి రైతుకు విముక్తి కలిగించేదే 'ఎలక్ట్రిక్ వీడర్'. 3 గంటలు ఛార్జింగ్ చేస్తే 2 ఎకరాల వరకు సునాయాసంగా అంతర సేద్యం చేసుకోవచ్చు. ఇంజన్ బరువు తక్కువగా ఉంటుంది కాబట్టి బరువు కొరక ఒక రాయి లేదా ఇసుక బస్తా వేసుకుంటే సరిపోతుంది. తేలికపాటి నేలలకు ఎంతో అనుకూలమైనది. నేల ఉలిపసిమిగా వుంటే ఈ వీడర్‌తో కలుపు తీయడం ఎంతో సులభం. ఒకే చక్రంతో ఏర్పాటు చేయబడింది కాబట్టి జొన్న, మొక్కజొన్న, వేరుశనగ లాంటి తక్కువ వెడల్పు వున్న సాళ్ళలో కూడా సునాయాసంగా అంతర సేద్యాలు చేసుకోవచ్చు. పొలం పనులతో పాటు, ధాన్యం ఆరబెట్టుకోవటానికి కూడా ఎంతో అనువుగా పని చేస్తుంది. దీనికి సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకోవచ్చు. అప్పుడు ఎంతసేపైనా సరే సేద్యం చేసుకోవచ్చు. దీనికి స్ప్రేయర్ కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.



వివరాలకు సంప్రదించండి
పల్లెసృజన
77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096
E-mail : anchor@pallesrujana.org Visit us : www.pallesrujana.org
హనీబీ
NATIONAL INNOVATION FOUNDATION
E-mail : info@nifindia.org www.nifindia.org
Toll Free : 1800 233 5555

పల్లెసృజన www.pallesrujana.org
పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన గ్రామీణ ఆవిష్కరణలు
NABARD

# ధాన్యం తోడే పంపు

## బరువు బస్తాలు ఎత్తవలసిన అవసరం లేదు



ఇన్నోవేటర్
**ఉదయ భాస్కర్**
హైదరాబాద్, తెలంగాణ

పెద్ద రైస్ మిల్లుల యజమానులు ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత మర ఆడించేందుకు మిల్లులోకి పొయ్యాలంటే చాలామంది బలమైన కూలీలు అవసరం, లేదా పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టి కన్వేయర్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి వుంటుంది. అలాగే ఎక్కువ ధాన్యం పండించే రైతులు ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత వాటిని సంచుల్లో నింపి ఆ తర్వాత ట్రాక్టరు లేదా లారీల్లో తరలించాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఈ సమస్య పరిష్కారానికి కనుగొన్నదే 'ధాన్యం తోడే పంపు'. దీని సక్షన్ పైపు ధాన్యం కుప్పపైన వుంచి, డెలివరీ పైపును కావలసిన చోట పెట్టుకుంటే చాలు ఇంజను నీళ్ళు తోడినట్టు ధాన్యాన్ని తోడేస్తుంది. ధాన్యం బరువును బట్టి బ్లోయర్ వేగాన్ని సరిచేసుకుంటే చాలు.



వివరాలకు సంప్రదించండి
పల్లెసృజన
77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096
E-mail : anchor@pallesrujana.org Visit us : www.pallesrujana.org
హనీబీ
NATIONAL INNOVATION FOUNDATION
E-mail : info@nifindia.org www.nifindia.org
Toll Free : 1800 233 5555

PALLE SRUJANA Telugu Bi-monthly January - February 2023 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే



పల్లెసృజన సభ్యులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. సభ్యులుగా చేరాలనుకున్నవారు చందా కట్టి, మీ చిరునామాను స్పష్టంగా 9866001678 కి పంపడం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096

లేదా నేరుగా ఈ బ్యాంక్ లో జమ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023**

లేదా

PhonePe

"Phone Pe" no 9866 00 1678

QR code for Phone Pe

**సభ్యత్వ వివరాలు (2 సంవత్సరాలకు)**

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరి |
|---|---|---|
| సాధారణ పోస్టు ద్వారా | 400/- | 1,000/- |
| రిజిష్టరు పోస్టు ద్వారా | 640/- | 1,240/- |

'గూగుల్ పే/ ఫోన్ పే' చెయ్యాలనుకున్న వారు 9652801700 నెంబరుకు లేదా ఈ క్యూఆర్ కోడ్ ద్వారా పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.